ANN తెలుగు
Follow: @ANNTELUGU
20-09-2026
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 241 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## తెరవెనుక చదరంగం

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు, సంచలన తీర్పులు, వ్యూహాత్మక దాడులతో నేతల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి ఖైరతాబాద్ ఉపఎన్నిక సమీకరణాల వరకు, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి వేసిన అడుగులు బీఆర్ఎస్, బీజేపీలను ఎలా ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టాయి? తెరవెనుక చదరంగం.. తెరముందు రాజకీయ కురుక్షేత్రం. జంపింగ్ ల జాతరకు బ్రేక్ వేస్తూ దానం నాగేందర్ రూపంలో పడిన సంచలన తీర్పు తెలుగు రాష్ట్రాల రాజకీయాన్ని ఒక్కసారిగా ఉలికిపడేలా చేసింది. ఖైరతాబాద్ ఉపఎన్నిక రణభూమిలో అధికార కాంగ్రెస్ వ్యూహం ముందు ప్రత్యామ్నాయ పార్టీలు ఎలా అడ్డంగా బుక్కయ్యాయి? అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి వేసిన రాజకీయ పావులు గులాబీ శిబిరాన్ని ఎలా ఆత్మరక్షణలోకి నెట్టాయి? ఎర్రవెల్లి భూముల సర్వే నుంచి ఏపీ స్థానిక పోరు వరకు తెరవెనుక సాగుతున్న అసలు కథాకమామిషూ ఏమిటి?

04

**ఈ రాజకీయ తుఫాన్ వెనుక దాగున్న లోతైన నిజాలపై.. మహా పత్రిక మేనేజింగ్ డైరెక్టర్**



**కంది రామచంద్రారెడ్డి**
*వీకెండ్ అనాలసిస్*

టాప్ న్యూస్

### వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏం పేరు పెడదాం

- అభిప్రాయం కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- కాకతీయ వీరనారి రాణిరుద్రమ ఎయిర్ పోర్ట్ పేరుకే జనం మొగ్గు
- కాంగ్రెస్ పోల్ లో 60శాతం మొగ్గు అటే



02

### వరంగల్ ఎయిర్‌పోర్టుపై సందీప్ రెడ్డి వంగా సజెషన్

- దట్స్ ద స్పిరిట్ అంటూ సీఎం ప్రశంసలు



02

### రేవంత్ రెడ్డి, కేటీఆర్ ప్రాణ దోస్తులు

- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఆధారాలున్నా చర్యల్లేవ్.. వారిది క్విడ్ ప్రోకో



02



### జన్వాడ ఫాం హౌస్ కూల్చివేతకు
# రంగం సిద్ధం?

**ఫాంహౌస్ ఉల్లంఘనను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీల టీమ్**



- ఆ ఫాంహౌస్ కు అనుమతులు లేవు కాంగ్రెస్ ఎంపీలు
- నాలా పై ఫాంహౌస్ : కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి
- సత్యం రామలింగరాజు భూముల్లో అక్రమంగా ఫాంహౌస్ : చామల
- అక్రమాలు జరిగాయని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

**రంగారెడ్డి, మహా :** ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అకారణంగా.. జైలుకు పంపిన ఫాంహౌస్ నిర్మాణ గుట్టును ఎంపీలు ట్టు చేశారు. నాలాపై ఈ అక్రమ నిర్మాణం జరిగిందని, అక్రమాల పునాదులపై జన్వాడ ఫాంహౌస్ నిర్మించారని కాంగ్రెస్ ఎంపీలు తేల్చారు. దీంతో ఈ అక్రమాల వివాదాస్పద ఫాంహౌస్ ను కూల్చివేసే అవకాశం కనబడుతోంది. దీనిపై ఎంపీలు హైడ్రాకు కూడా ఫిర్యాదుచేయగా, హైడ్రా ఇప్పటికే నోటీసులు జారీచేయడంతో పాటు ఇచ్చిన గడువు కూడా పూర్తయింది. దీంతో ఇక కూల్చివేత ఖాయమన్న చర్చ ఉంది. జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని, నాలాపై ఫాంహౌస్‌ను

మిగతా 3వ పేజీలో

# బిల్డర్ల బరితెగింపు..!

### రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో కమర్షియల్ దందా..!



పూర్తయి ఆక్యుపెన్సీ పొందిన భవనాలు

## వరుసగా 11 అక్రమ షెటర్ల నిర్మాణం...!

- ఓసీ పొందిన తర్వాత నిర్మాణాలకు శ్రీకారం..!
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ..!
- ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే నిబంధనలకు తూట్లు..!
- వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ పేర్లతో యథేచ్ఛగా నిర్మాణాలు..!
- నివాస సముదాయాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చిన వైనం..!
- రోడ్డు భద్రత, ట్రాఫిక్‌కు ముప్పుగా షెటర్లు..!
- ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం ..!

02

రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో కమర్షియల్ దందా కోసం బిల్డర్లు బరితెగింపుకు పాల్పడుతున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం అనుమతులు పొందిన సదరు బిల్డర్లు నిర్మాణాల అనంతరం ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ) పొందిన తర్వాత బిల్డర్లకు వక్రబుద్ధి పుట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వరుసగా 11 కమర్షియల్ షెటర్లను అక్రమంగా నిర్మించి, కాసుల కక్కుర్తికి తెగబడుతున్నారని వారు మండిపడుతున్నారు. స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ షెటర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జారీ చేసిన ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న షెటర్లు


పార్కింగ్ స్థలంలో షెటర్ల నిర్మాణం



## మంగళగిరిలో మహిళా క్రికెట్ జాతర

- డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీ ఆవిష్కరించిన నారా బ్రహ్మణి
- అట్టహాసంగా ప్రారంభమైన తొలి విమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్
- తొలి మ్యాచ్ లో సత్తా చాటిన రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు
- ప్రత్యేక ఆకర్షణగా మెరిసిన నిధి అగర్వాల్

03

**మంగళగిరి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళా క్రికెట్‌కు కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలోని యువ క్రీడాకారిణుల ప్రతిభను వెలుగులోకి తెచ్చి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) తొలి సీజన్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకకు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

మిగతా 3వ పేజీలో

## 22ఏ సమస్యలకు త్వరలో ముగింపు

- 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జీవో జారీ
- మరికొన్ని అంశాలపై తీపికబురు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

02



## అందులో 180 ఎకరాలు మావే

- ఎర్రవల్లి సర్వే భూములపై వెంకటాపూర్ గ్రామస్థులు
- మా భూమిని గందరగోళంగా కేసీఆర్ కలిపేశారు
- సర్వే నెంబర్ 325లోని 215మంది రైతులకు నోటీసులు

**గజ్వేల్ , మహా :** ఎర్రవల్లి భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని భూములపై రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే కొనసాగుతున్న వేళ.. తాజాగా శివారు

మిగతా 2వ పేజీలో





# బిల్డర్ల బరితెగింపు..!




**మహా, సిటీ బ్యూరో, హైదరాబాద్:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్గిరి జోనల్, మౌలాలి సర్కిల్, ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే, డీ మార్ట్‌కు అతి సమీపంలో బిల్డర్లు బరితెగింపునకు పాల్పడ్డారు. 'వీవీకే స్క్వేర్', శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్' ప్రాజెక్ట్ పేర్లతో నివాస సముదాయం పేరిట అనుమతులు పొందిన బిల్డర్లు, తీరా అపార్ట్మెంట్ల నిర్మాణం పూర్తయ్యాక, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ) పొందిన అనంతరం సదరు బిల్డర్లు తమ అసలు రంగును బయటపెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అపార్ట్‌మెంట్ ముందు భాగంలో సెట్‌బ్యాక్ నిబంధనలను గాలికొదిలేసి, ఏకంగా వరుసగా 11 కమర్షియల్ షెటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని స్థానికులు పేర్కొంటున్నారు. రెసిడెన్సియల్ అవసరాల కోసం అనుమతులు పొంది.. తీరా నిర్మాణం పూర్తయ్యాక నిబంధనలను నడిరోడ్డుపై పాతరేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) చేతికి రాగానే, ప్లాన్‌కు విరుద్ధంగా కమర్షియల్ దందాలకు తెరలేపుతున్న వైనంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఓసీ పొందిన తర్వాతే అసలు "స్కెచ్"..!

సాధారణంగా నివాస ప్రాంతాల్లో కమర్షియల్ కార్యకలాపాలకు అనుమతులు లభించవు. దీంతో సదరు బిల్డర్లు ముందుగా నివాస సముదాయం (రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్) పేరుతో అనుమతులు పొందారని, నిర్మాణం పూర్తయినట్లు చూపిస్తూ అధికారుల నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓ .సి ) కూడా దక్కించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, ఓసీ చేతికి అందగానే సదరు బిల్డర్లు నిబంధనల ప్రకారం ఉండాల్సిన నిర్మాణాన్ని కమర్షియల్ అవసరాలకు అనుగుణంగా మార్చేసే పనులకు శ్రీకారం చుట్టారని, వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ పేర్లతో నివాస అవసరాల కోసం కేటాయించిన గ్రౌండ్ ఫ్లోర్ ప్రాంగణాన్ని పూర్తిగా వాణిజ్య కేంద్రంగా మార్చి ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 11 కమర్షియల్ షెటర్లను వరుసగా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నివాస ఇంత పెద్ద సంఖ్యలో షెటర్ల నిర్మాణం పూర్తయి తర్వాత వాటిని వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తే అపార్ట్‌మెంట్ స్వరూపమే మారిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కా ప్లాన్ ప్రకారం ఒక నివాస ప్రాంతాన్ని కమర్షియల్ సెంటర్‌గా మార్చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు నిద్రమత్తు వీడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

### టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ..!

ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే అక్రమంగా కమర్షియల్ షెటర్ల నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బిల్డర్లతో టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై భారీగా ముడుపులు ముట్టడంతోనే అక్రమ షెటర్లను అడ్డుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ముందస్తు పథకం ప్రకారమే వరుసగా కమర్షియల్ షెటర్ల నిర్మాణాలకు బిల్డర్లు పాల్పడుతున్నారని, అధికారుల అండదండలు ఉండటంతోనే నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మౌలాలి డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### రోడ్డు భద్రత, ట్రాఫిక్‌కు తీవ్ర ముప్పు..!

ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌లో వరుసగా షెటర్లు ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, వ్యాపారాల కోసం వచ్చే వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. దీనివల్ల ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, కాలనీవాసులకు, వాహనదారులకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, ఇది రోడ్డు భద్రతకు కూడా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.



### ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం ..!

రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌ను కమర్షియల్‌గా మార్చడంతో పాటు, అక్రమంగా షెటర్లు నిర్మిస్తున్న వ్యవహారంపై స్థానిక నివాసితులు, కాలనీ సంఘాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారని వారు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి, వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చేపడుతున్న 11 కమర్షియల్ షెటర్ల నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, జారీ చేసిన ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (ఓసీ)ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి, కేటీఆర్ ప్రాణ దోస్తులు

- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఆధారాలున్నా చర్యల్లేవ్.. వారిది క్విడ్ ప్రోకో



**హైదరాబాద్, మహా** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేటీఆర్ ప్రాణ, ధన, దాన దోస్తులని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఏఐసీసీకి కప్పం కట్టేందుకే భూదోపిడీపై రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌తో బేరసారాలు చేస్తున్నారని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. భూదందాపై అన్నీ ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలను ఫాంహౌజ్‌లకు పంపడం పక్కా రాజకీయ డ్రామా అని పేర్కొన్నారు. 'ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యం. ముస్లిం ఓట్లతో కాంగ్రెస్ గెలవాలని చూస్తోంది. మెజారిటీ హిందూ ఓటర్లు ఐక్యంగా ఉండలేరని కాంగ్రెస్ ధీమా. హిందూ ఓటర్లు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కుట్రలను గమనించాలి. హిందూ ఓటర్ల సత్తా ఏంటో ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో చూపండి. కేటీఆర్ చిన్నప్పటి దోస్తులతో క్విడ్ ప్రోకో దందా చేస్తున్నారు. ఒక ఫ్రెండ్‌తో సెంట్రో చెప్పుల వ్యాపారం పెట్టించాడు. ఆ వ్యాపారాన్ని అంబానీకి అప్పగించాడు. ఇంకో ఫ్రెండ్ ఫాంహౌజ్‌ను లీజుకు తీసుకొని, ప్రతిఫలంగా హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో బిల్డింగ్‌కు పర్మిషన్లు ఇచ్చాడు. ఇంకో ఫ్రెండ్‌తో కొత్తూరులో లాజిస్టిక్ పార్క్ పెట్టిస్తాడు. మరో ఫ్రెండ్‌తో హోటల్, మెడికల్ డివైజెస్ వ్యాపారం పెట్టించాడు. లాభాలు మాత్రం తానే కొట్టేస్తున్నడు. నిజాం కాలేజీ ఫ్రెండ్‌కు ఖానాపూర్ టిక్కెట్ ఇస్తడు. సిట్టింగ్ ఎమ్మెల్యేను గాలికొదిలేసిండు' అని బండి సంజయ్ ఆరోపించారు.

# అందులో 180 ఎకరాలు మావే

( మొదటి పేజీ తరువాయి )

వెంకటాపూర్ గ్రామస్థులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. సర్వే నంబర్ 325లో ఉన్న మొత్తం 388 ఎకరాల్లో తమ గ్రామానికి చెందిన భూములు కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఇందులో సుమారు 180 ఎకరాలు వెంకటాపూర్‌కు చెందినవేనని గ్రామస్థులు వాదిస్తున్నారు. మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో సుమారు 388 ఎకరాల భూముల హద్దులు, రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ భూములు ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరదరాజుపూర్ ప్రాంతాలకు విస్తరించి ఉన్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. శుక్రవారం నాటికి 388 ఎకరాల భూముల బౌండరీని శాటిలైట్ సాయంతో నిర్ధారించినట్లు సమాచారం. శనివారం కూడా ప్రత్యేక బృందాలతో సర్వే కొనసాగింది. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామానికి 250 ఎకరాలు మాత్రమే ఉన్నాయని వెంకటాపూర్ గ్రామస్థులు చెబుతున్నారు. మిగిలిన భూమిలో సుమారు 180 ఎకరాలు తమ గ్రామ పరిధికి చెందినవేనని వారు పేర్కొంటున్నారు. గతంలో అధికారుల రికార్డుల నిర్వహణలో జరిగిన తప్పిదాల కారణంగా తమ భూములు ఎర్రవల్లి సర్వే నంబర్‌లోకి వెళ్లాయని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు సర్వే నంబర్ 325లో సాగు చేస్తున్న 215 మంది రైతులకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు.



## ఎర్రవల్లిలో ముమ్మరంగా కొనసాగుతున్న భూముల రీసర్వే

గజ్వేల్ , మహా : సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి పరిధిలో సర్వే నంబర్ 325 భూముల రీసర్వే మూడో రోజు ముమ్మరంగా కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పాండవుల చెరువు, గుట్ట ప్రాంతాలు, కాలువల హద్దులను క్షేత్రస్థాయిలో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తిస్తున్నారు. మరోవైపు శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన 113 ఎకరాల భూమి విలీనంపై గ్రామస్థులు స్పందిస్తూ పాత రికార్డుల ప్రకారం న్యాయం చేయాలని కోరుతున్నారు. సర్వే నివేదిక ఆధారంగా రైతులకు త్వరలో నోటీసులు జారీ కానున్నాయి

# 22ఎ సమస్యలకు త్వరలో ముగింపు

- 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జీవో జారీ
- మరికొన్ని అంశాలపై తీపికబురు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను విడుదల చేశామన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి గాను ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, ఈ క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ఇటీవల శాసనసభలో భూ సమస్యలపై సుదీర్ఘంగా చెప్పామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సూచనలు, 12 అంశాల మేరకు ఈ సరూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు.మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని ఈరోజు నిలబెట్టుకున్నామన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెలరోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లుకూల్చదని స్పష్టం చేశారు. జీవో 118 సహకారంతో మేడ్చల్ , రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. 22ఎ అనేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి అమలులో ఉందని, దీనిని పరిశీలించుకోవచ్చునన్నారు. అయితే కొంతమంది దీనిని అసరాగా చేసుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు త్వరలో ఈ మేరకు శుభవార్త చెబుతారని ప్రకటించారు. సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవో 76 ను అమలు చేయబోతున్నామని దీనికోసం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్. బి. నగర్, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి .సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎల్. బి. నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ ఎయిర్‌పోర్టుపై సందీప్ రెడ్డి వంగా సజెషన్

**దట్స్ ద స్పిరిట్ అంటూ సీఎం ప్రశంసలు**



**వరంగల్, మహా :** వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరిన నేపథ్యంలో డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా స్పందించారు. తన సొంత ప్రాంతమైన వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు కానుండటంపై సంతోషం వ్యక్తం చేసిన ఆయన.. రెండు పేర్లను సూచించారు. వరంగల్ చరిత్ర, కాకతీయుల సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే పేరు ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వరంగల్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం కల సాకారం కాబోతుండటం ఎంతో సంతోషంగా ఉందంటూ సందీప్‌రెడ్డి వంగా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కొత్త ఎయిర్‌పోర్టుకు 'రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు(ఆర్ఐఏ)' 'కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు(కేఐఏ)' పేర్లను పరిశీలించాలని సూచించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక నేపథ్యం, కాకతీయుల వారసత్వాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయానికి పేరు ఉంటే అర్థవంతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. వరంగల్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి సందీప్‌రెడ్డి వంగా ధన్యవాదాలు తెలిపారు. తన సొంత ఊరికి విమానాశ్రయం వస్తుండటంపై ఆనందం వ్యక్తం చేస్తూ చేసిన ఈ పోస్టు వైరల్‌గా మారింది. దీనికి సీఎం 'దట్స్ ది స్పిరిట్ ' అంటూ స్పందించారు. ప్రస్తుతం ఈ ఇద్దరి మధ్య జరిగిన సోషల్ మీడియా సంభాషణ వైరల్‌గా మారింది.

# వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు ఏం పేరు పెడదాం

**హైదరాబాద్, మహా :** వరంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన మామునూరు విమానాశ్రయం కాంగ్రెస్ ప్రజాపాలనలో త్వరలోనే నిజం కాబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విమానాశ్రయ విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కి భూములను అప్పగించినట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి సారించారని, వరంగల్ ఎయిర్‌పోర్టు కలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భూసేకరణ కోసం రూ.295 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో విమానాశ్రయ పనులు వేగంగా ఊపందుకుంటున్నాయని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు కేవలం రాకపోకల కోసమే కాకుండా.. పరిశ్రమలు, పర్యాటకం, విద్యారంగం, ఉద్యోగావకాశాలు, భారీ పెట్టుబడులకు సరికొత్త ముఖద్వారంగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రగతిపథంలో దూసుకుపోతున్న తెలంగాణకు ఈ విమానాశ్రయం నూతన చిహ్నంగా మారుతుందని, ఇక్కడి నుంచి విమాన ప్రయాణాలు ఎప్పుడు ప్రారంభమవుతాయా అని తానూ ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే క్రమంలో వరంగల్ కొత్త విమానాశ్రయానికి ఏ పేరు పెడితే బాగుంటుందో ప్రజలు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం కోరారు.

**రాణి రుద్రమ పేరుకే ప్రజల మొగ్గు: కాంగ్రెస్ పోల్‌లో వెల్లడి**



ముఖ్యమంత్రి చేసిన ట్వీట్‌పై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతా స్పందిస్తూ ఒక ఆన్‌లైన్ పోల్ నిర్వహించింది. ప్రజా ప్రభుత్వ సంకల్పంతో నిర్మితమవుతున్న వరంగల్ ఎయిర్‌పోర్టుకు ఏ పేరు పెడితే బాగుంటుందో సూచించాలంటూ నాలుగు ఆప్షన్లను ఇచ్చింది. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ ఎయిర్‌పోర్ట్, రాణి రుద్రమ ఎయిర్‌పోర్ట్, సమ్మక్క సారక్క ఎయిర్‌పోర్ట్, చాకలి ఐలమ్మ ఎయిర్‌పోర్ట్ పేర్లను పేర్కొంది. ఈ పోలింగ్‌లో పాల్గొన్న నెటిజన్లు పోస్ట్ పెట్టిన గంటసేపట్లో వెల్లడించిన అభిప్రాయాల మేరకు అత్యధికంగా 59.2 శాతం మంది రాణి రుద్రమ ఎయిర్‌పోర్ట్ పేరుకే మొగ్గు చూపడం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో ప్రొఫెసర్ జయశంకర్ (17.9%), సమ్మక్క సారక్క (17.3%), చాకలి ఐలమ్మ (5.6%) పేర్లు నిలిచాయి. ఓరుగల్లు గడ్డపై నిర్మించే విమానాశ్రయానికి వీరవనిత రాణి రుద్రమదేవి పేరు ఖరారు చేయాలంటూ అత్యధికులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏ పేరు పెడుతుందనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఇంద్రకీలాద్రిపై నకిలీ టికెట్ల కలకలం

- దసరా మహోత్సవాలను ఆసరాగా చేసుకొని నకిలీ టికెట్ల విక్రయం.

**విజయవాడ, మహా**: ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలను ఆసరాగా చేసుకుని నకిలీ టికెట్ల విక్రయానికి పాల్పడిన వ్యవహారం కలకలం రేపుతోంది. ఈ నెల పదహారో తేదీన కావలికి చెందిన ఓ మహిళా భక్తురాలు నకిలీ టికెట్ వ్యవహారంపై దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**రూ.3,500 టికెట్ కొనుగోలు**

దసరా మహోత్సవాల సందర్భంగా ఈ నెల పద్దెనిమిదో తేదీకి సంబంధించిన మూడు వేల ఐదు వందల రూపాయల శ్రీచక్రార్చన టికెట్‌ను మహిళా భక్తురాలు కొనుగోలు చేశారు. టికెట్ చేతికి వచ్చిన అనంతరం దానిపై అనుమానం రావడంతో ఆమె దేవస్థానం ఐటీ విభాగాన్ని సంప్రదించారు.

**ఆన్‌లైన్ కోటా విడుదల కాలేదన్న దేవస్థానం**

భక్తురాలు చూపించిన టికెట్‌పై దేవస్థానం ఐటీ విభాగం పరిశీలన చేపట్టినట్లు సమాచారం. దసరా ఉత్సవాలకు సంబంధించి ఆన్‌లైన్ కోటాను దేవస్థానం విడుదల చేయలేదని అధికారులు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో భక్తురాలి వద్ద ఉన్న టికెట్ నకిలీదై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భక్తులకు దేవస్థానం హెచ్చరిక**

దసరా మహోత్సవాల సమయంలో భక్తులు టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. దేవస్థానం అధికారికంగా విడుదల చేయని టికెట్లను కొనుగోలు చేయకుండా.. అధికారిక మార్గాల ద్వారా మాత్రమే టికెట్లు పొందాలని అధికారులు సూచిస్తున్నారు.

**విచారణకు దారితీసిన వ్యవహారం**

దసరా మహోత్సవాలను ఆసరాగా చేసుకుని నకిలీ టికెట్ల విక్రయం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై అధికారులు మరింత లోతుగా పరిశీలించే అవకాశం ఉంది. నకిలీ టికెట్లు ఎక్కడ ముద్రించారు, వాటిని ఎవరు విక్రయించారు, ఎంతమంది భక్తులకు విక్రయించారన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



# ప్రజలకు పంగనామాలు పెట్టారు

- ప్రజలు తిరగబడటం మొదలైంది.
- ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.
- కరువుతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ముందుచూపు కార్యాచరణ లేదు: పేర్ని నాని



విజయవాడ, మహా: జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల కంటే అధికంగా ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసీపీ నేత పేర్ని నాని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వంపై తిరగబడటం మొదలైందని, అందుకే వారిని ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

రైతులను గాలికి వదిలేశారు

రాష్ట్రంలో కరువు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం ముందుచూపుతో ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదని పేర్ని నాని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని విమర్శించారు.

**ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**

జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కంటే ఎక్కువ ప్రయోజనాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వారు ఇప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్ని నాని అన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి ప్రశ్నించడం ప్రారంభించారని పేర్కొన్నారు.

**తండ్రికొడుకులపై తీవ్ర ఆరోపణలు**

రాష్ట్రాన్ని దోచుకోవడంలో తండ్రికొడుకులకు క్షణం తీరిక లేకుండా పోయిందని పేర్ని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో ప్రభుత్వ పెద్దలు ఇతర వ్యవహారాలపై దృష్టి సారిస్తున్నారని విమర్శించారు.

**ప్రజలు సమాధానం చెబుతారు**

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే ప్రజల నుంచి మరింత వ్యతిరేకత ఎదురవుతుందని పేర్ని నాని అన్నారు. రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**లబ్ధిదారులకు కార్డులు అందజేసిన మాజీ కార్పొరేటర్**



**కుషాయిగూడ, మహా:** పౌర సరఫరాల శాఖ ద్వారా జారీ చేసిన కొత్త రేషన్ కార్డులను కుషాయిగూడ డివిజన్ పరిధిలో లబ్ధిదారులకు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రేషన్ కార్డుల ద్వారా లభించే ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. రేషన్ కార్డు ద్వారా ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా అందుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వివిధ సంక్షేమ పథకాలకు అర్హత పొందేందుకు రేషన్ కార్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత/ఆసరా పెన్షన్, రైతు భరోసా, ఇందిరమ్మ భీమా వంటి పథకాల ప్రయోజనాలకు రేషన్ కార్డు సంబంధిత అర్హతల్లో ఉపయోగపడుతుందని వివరించారు. కొత్త రేషన్ కార్డులను ఆధునిక స్మార్ట్ కార్డు తరహాలో అందిస్తున్నట్లు, రేషన్ పొందడంతో పాటు ప్రభుత్వ సేవలు, ఇతర అవసరాల్లో గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

# మల్లికార్జున్ నగర్‌లో ఘనంగా గణేష్ పూజలు



**కుషాయిగూడ,మహా :** శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్రసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేముల రాజు దంపతులు, వేముల రమేష్ దంపతులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని గణనాథుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



# పట్నంలో ఆధ్యాత్మికతతో అలరించిన శ్రీనివాస కల్యాణోత్సవం..

- **శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి..**
- **నవరాత్రి వేడుకల్లో భాగంగా గణనాథుడిగా ప్రత్యేక పూజలు..**
- **వేంకటేశ్వరుడి కృప ప్రజలపై ఉండాలని మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాంక్ష...**

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 19 మహా:** శ్రీనివాసుని కృపతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణ మహోత్సవానికి మల్‌రెడ్డి హాజరయ్యారు. జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణేశ్ మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే... లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని తిరుమల సంప్రదాయాలను అనుసరిస్తూ, వేదపండితులు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు శ్రీనివాసుడి సేవలో తరించిన ఎమ్మెల్యే.. ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణ మహోత్సవంలో నిర్వహించిన జేఆర్ ఫ్రెండ్స్‌ను అభినందించిన మల్‌రెడ్డి.. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనలో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, సిఐ మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, మున్సిపల్ కౌన్సిలర్లు ఇందూరి శ్రీనివాస్, రామదాసు నాయక్, ఏఎంసి డైరెక్టర్లు దొంతరమోని రాజు, తాళ్ల మహేష్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మండల అధ్యక్షులు రావణమోని లింగం, కొంగర డివిజన్ అధ్యక్షులు చెన్నమోని రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతిగళ్ల మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, తాళ్ల శ్రీశైలం గౌడ్, సిద్దంకి కృష్ణారెడ్డి మంకాల దాసు, వింజమూరి ప్రేమాకర్ రెడ్డి, ప్రశాంత్ రావు, మహిళ నాయకురాలు జయమ్మ, సత్య రాణి, కోడూరి రమేష్, వరికుప్పల సుధాకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# జన్వాడ ఫాం హౌస్ కూల్చివేతకురంగం సిద్ధం

( మొదటి పేజీ తరువాయి )

కట్టారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం జన్వాడ ఫాంహౌస్‌కు వెళ్లింది. ఈ సందర్భంగా ఫాంహౌస్ భూములను ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. అనంతరం కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. అక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే జన్వాడ ఫాంహౌస్‌కు వచ్చామని తెలిపారు. ఫాంహౌస్‌ను నాలాపై కట్టారని.. దీని నిర్మాణానికి అనుమతులు లేవన్నారు. ఫాంహౌస్ ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదని మల్లు రవి అన్నారు.

**ఫాం హౌస్ భూమి ప్రదీప్ రెడ్డికి ఎలా వచ్చింది : చామల**

ఫాంహౌస్ దగ్గరకు వస్తే ప్రదీప్‌రెడ్డి కేసులు పెడతామన్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు. అసలు ఇన్ని ఎకరాల్లో ఫాంహౌస్ ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. జన్వాడ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ ఎగరవేస్తే రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టారని మండిపడ్డారు. కేటీఆర్ స్నేహితుడే ప్రదీప్‌రెడ్డి అని.. ఆయనకు ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్‌లో అద్దెకు ఉంటున్నారని ప్రదీప్ చెప్పారని తెలిపారు. పురపాలక మంత్రిగా కేటీఆర్ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమంగా జన్వాడలో ఫాంహౌస్ నిర్మించారని ఆరోపణలు గుప్పించారు. సత్యం రామలింగరాజు భూముల్లో ఫాంహౌస్ నిర్మించారని తెలిపారు. కేటీఆర్ సతీమణి శైలిమ పేరుతో ఇక్కడ భూమి ఉందన్నారు. కేటీఆర్ అత్త పేరుపై



కూడా భూములు ఉన్నాయని చెప్పారు. ఈ భూమలన్నీ శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవి అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

**జన్వాడ ఫామ్‌హౌస్ భవన నిర్మాణానికి అనుమతి లేదు**

జన్వాడ భూములపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసిన ఎంపీ జన్వాడలో అక్రమ ఫాంహౌస్‌లు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. ఇక్కడ భవన నిర్మాణానికి అనుమతి లేదని మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌లో చెప్పారు. గతంలో అడిగితే సర్పంచ్ అనుమతితో నిర్మించుకున్నట్లు యజమాని చెప్పారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి కేటీఆర్‌కు బినామీ అని ఎంపీ చామల పేర్కొన్నారు. సర్వే నంబర్ 311, 301, 313లో అక్రమాలు జరిగితే నిగ్గు తేలుస్తామని సవాల్ చేశారు. ఈ భూములన్ని సత్యం రామలింగరాజువని, డీ అండ్ యూ కంపెనీ పేరు మీద భూములు ట్రాన్స్‌ఫర్ చేశారని చామల తెలిపారు. వేరే కంపెనీ నుంచి ఈ భూములను ప్రదీప్‌రెడ్డి పేరుపై ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని, 111 జీవోతో సత్యం రామలింగరాజు ఆస్తులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. సత్యం రామలింగరాజు కంపెనీ నుంచి ఈ భూములు రాజేష్‌కు బదిలీ అయ్యాయని, ఆ తరువాత ప్రదీప్‌రెడ్డికి బదిలీ అయ్యాయని తెలిపారు. ఈ భూములు కేటీఆర్‌కు స్నేహితుడు ఇచ్చినట్లు ఆధారాలు లేవని, అధికార దుర్వినియోగం చేసి కేటీఆర్, హరీశ్‌రావు కొల్లగొట్టారని ఆరోపించారు.

**కేటీఆర్ లీజుకు తీసుకున్నట్లు ఎక్కడా పత్రాలు లేవు: ఆది శ్రీనివాస్**

ప్రదీప్‌రెడ్డి నుంచి కేటీఆర్ లీజుకు తీసుకున్నట్లు ఎక్కడా పత్రాలు లేవని ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ భూములు ఎంతమేరకు ఆక్రమించుకున్నారో మాత్రమే మేం చూస్తున్నామని చెప్పారు. సిద్దిపేటలో చుట్టూ రంగనాయక్‌సాగర్ ఉండి మధ్యలో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన దోపిడీపై కవిత చేసిన ఆరోపణలకు ఎవరూ సమాధానం ఇవ్వలేదని, 111 జీవో అమలులో ఉన్న చోట జన్వాడ ఫామ్‌హౌస్ ఉందన్నారు.

**ఫాంహౌస్ వద్ద బీఆర్‌ఎస్ హడావుడి**

జన్వాడ ఫాంహౌస్ వద్ద కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఫాంహౌస్ భూములను పరిశీలించేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతల బృందాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలో హైటెన్షన్ నెలకొంది.

# మంగళగిరిలో మహిళా క్రికెట్ జాతర

( మొదటి పేజీ తవరువాయి )




నారా బ్రహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేసి, టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీ రాజ్‌తో కలిసి ఆమె ట్రోఫీని ఆవిష్కరించారు. అంతకుముందు, స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రహ్మణికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీశ్ బాబు ఘనస్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసిన బ్రహ్మణి, మిథాలీ రాజ్‌తో కలిసి డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా నారా బ్రహ్మణి మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా ఇలాంటి ఒక ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది రాష్ట్రంలోని యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక అని అభివర్ణించారు. సరైన అవకాశం లభిస్తే మహిళలు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని, ఈ లీగ్‌లో రాణించే క్రీడాకారిణులు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా (రోల్ మోడల్స్‌గా) నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళగిరి వేదికగా ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని నాని, కార్యదర్శి సానా సతీశ్ బాబు, ఇతర నిర్వాహకులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ మహిళా క్రికెటర్లను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, అవకాశాలు కల్పించడమే డబ్ల్యూఏపీఎల్ ప్రధాన లక్ష్యం. ఇక్కడ రాణించిన వారిని జాతీయ స్థాయిలో జరిగే ఉమెన్ ప్రీమియర్ లీగ్ , భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలన్నది ఏసీఏ సంకల్పం. ఈ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తూ, భారత క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం విశేషం. ఆమె స్ఫూర్తితో యువ క్రీడాకారిణులు మరింత ఉత్సాహంగా రాణిస్తారని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫ్రాంచైజీ పద్ధతిలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ టీ20 టోర్నమెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు ఉన్నాయి. మంగళగిరిలోని ఏసీఏ స్టేడియం వేదికగా ఏడు రోజుల పాటు మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య తొలి మ్యాచ్ జరగగా, ఇదులో రాయలసీమజట్టు గెలిచింది. సాయంత్రం ప్రారంభోత్సవం అనంతరం అమరావతి ఈఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ నిర్వహించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రహ్మణిని నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు డి. విష్ణుతేజ, క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వైఎస్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ భామ నిధి అగర్వాల్ కూడా సందడి చేశారు. రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు ను ఉత్సాహపరిచారు. టీమ్ యాజమానులు అమర్, రాజారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సెమీకండక్టర్‌లో అపారమైన అవకాశాలు

**టీ-చిప్ చైర్మన్ సందీప్ మక్తలా**

**హైదరాబాద్, మహా :** భారతదేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని టీచిప్ చైర్మన్, వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ చైర్మన్ సందీప్ మక్తలా చెప్పారు. సెమికాన్ ఇండియా 2026లో 52 దేశాలకు చెందిన 600కు పైగా సంస్థలు, సుమారు 50 వేల మంది సందర్శకులు పాల్గొంటుండటం భారతదేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న తీరుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం సెమీకాన్ 2.0 కింద రూ.1,27,500 కోట్లను కేటాయించడంతోపాటు ఇప్పటికే 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు రూ.1.64 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు ఆమోదించడం ఈ రంగంలో ఉన్న అవకాశాల స్థాయిని తెలియజేస్తున్నదని అన్నారు. సెమికాన్ ఇండియా సందర్భంగా సెమీ ఇండియా అధ్యక్షుడు అశోక్ చందక్‌ను సందీప్ మక్తలా సత్కరించి.. భారతదేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ చందక్‌తోపాటు సెమీకాన్ నాయకత్వాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సందర్శించాలని సందీప్ మక్తలా ఆహ్వానించారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాంకేతిక, ఇంజినీరింగ్, పరిశోధన, పారిశ్రామిక, యువ పారిశ్రామికవేత్తల సామర్థ్యాలను ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమతో అనుసంధానించే దిశగా సెమీకాన్ తెలంగాణ నిర్వహణను పరిశీలించాలనే ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ఇది ప్రస్తుతం ప్రతిపాదన మాత్రమేనని.. సెమీకండక్టర్ సంస్థలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, యువ పారిశ్రామికవేత్తలు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా తెలంగాణకు, తెలుగు రాష్ట్రాలకు కొత్త అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీకండక్టర్ అసోసియేషన్ డైరెక్టర్ కేజీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ పై అవగాహన

**మంచిర్యాల, మహా :** ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. హన్నన్ ఆధ్వర్యంలో ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా మంచిర్యాల ట్రాఫిక్ సీఐ ఎం.డి.హన్నన్ విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్ణీత వేగ పరిమితిలో వాహనాలు నడపడం అన్ని విధాల మంచిదని అన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం మంచి దాని అన్నారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగ్,ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలు,వాటి ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని అన్నారు.

# పేదలకు ఆస్తి హక్కు పట్టాలు

- **రాజముద్రతో ఇళ్ల పట్టాలు.. పేదలకు శాశ్వత చిరునామా కల్పిస్తాం: సీఎం చంద్రబాబు**




**విశాఖపట్నం, మహా:** విశాఖలో నిర్వహించిన పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఆస్తి హక్కు పట్టాలను పంపిణీ చేశారు. పేదలు స్వేచ్ఛగా, గౌరవంగా జీవించాలనే ఉద్దేశంతో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. రాజముద్ర వేసి పట్టాలు అందిస్తున్నామని చెప్పారు.

**పేదలకు ఆస్తి హక్కు**

పేదలకు కేవలం ఇళ్ల స్థలాలు ఇవ్వడం కాకుండా ఆస్తిపై హక్కు కల్పించాలనే ఉద్దేశంతో పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు అన్నారు. పట్టా చేతిలో ఉంటే పేదలకు ఆస్తిపై పూర్తి హక్కు ఉంటుందని తెలిపారు. తమకు శాశ్వత చిరునామా ఉండాలన్న పేదల ఆకాంక్షను నెరవేర్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు.

**35 కాలనీల్లో పట్టాల కోసం ఎదురుచూపులు**

ఇప్పటికీ విశాఖలోని 35 కాలనీల్లో సుమారు 10 వేల మంది పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. అర్హులైన వారందరికీ వీలైనంత త్వరగా పట్టాలు అందించాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

**పంచగ్రామాల్లో 12,149 మందికి పట్టాలు**

దేవస్థానానికి చెందిన పంచగ్రామాల్లో 12,149 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరగా పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

**పేదలకు శాశ్వత చిరునామా**

పేదలు స్వేచ్ఛగా, గౌరవంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. పేదలకు శాశ్వత చిరునామా కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పట్టాలు పొందిన ప్రతి కుటుంబం భద్రతతో జీవించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**అధికారులకు సీఎం ఆదేశాలు**

పట్టాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించి వీలైనంత త్వరగా పట్టాలు పంపిణీ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పేదలకు ఆస్తి హక్కు కల్పించే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చంద్రబాబు తెలిపారు.

# అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడారు

- **శ్రీశైలం నుంచి తెలంగాణ 80 టీఎంసీలు వాడుకుందంటున్నారు.**
- **8 టీఎంసీలు వాడితే 80 టీఎంసీలు ఎక్కడికి పోయాయి?: హరీశ్‌రావు.**

**హైదరాబాద్, మహా:** అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. శ్రీశైలం నుంచి తెలంగాణ 80 టీఎంసీల నీటిని వినియోగించుకుందని చెబుతున్నారని, వాస్తవంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వాwvరా కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించామని ఆయన అన్నారు. 8 టీఎంసీలు వినియోగిస్తే మిగిలిన 72 టీఎంసీల నీరు ఎక్కడికి వెళ్లిందో చెప్పాలని ప్రశ్నించారు.

**రైతుల పొలాల్లో కాకుండా ఎక్కడ వాడారు?**

శ్రీశైలం నుంచి తెలంగాణ 80 టీఎంసీల నీటిని వినియోగించుకుందని చెబుతున్నారని హరీశ్‌రావు అన్నారు. "రైతుల పొలాల్లో కాకుండా ఎక్కడ వాడారు?" అని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 8 టీఎంసీలు మాత్రమే వినియోగించామని ఆయన పేర్కొన్నారు.

**8 టీఎంసీలు వాడితే 80 టీఎంసీలు ఎలా?**

కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 8 టీఎంసీల నీటిని వినియోగించినప్పుడు 80 టీఎంసీలు ఎలా అవుతాయని హరీశ్‌రావు ప్రశ్నించారు. మిగిలిన నీటి వినియోగానికి సంబంధించిన లెక్కలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

**లెక్కలు చెప్పాలని డిమాండ్**

శ్రీశైలం జలాల వినియోగంపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని హరీశ్‌రావు అన్నారు. నీటి వినియోగానికి సంబంధించిన పూర్తి వివరాలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విద్యార్థుల యూనిఫాంలలో కొత్త రంగులు

- **పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, సామగ్రి అందేలా ప్రణాళిక రూపొందించాలి: సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, మహా:** విద్యార్థులకు అందించే యూనిఫాంలు మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. యూనిఫాం డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సూచించారు. విద్యార్థులకు అందించే యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, అవసరమైన సామగ్రి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**రెండో జత యూనిఫాం నెలాఖరులోగా**

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని తెలిపారు. కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే రెండు జతల యూనిఫాంలు అందించినట్లు వెల్లడించారు.

**విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు**

విద్యార్థులందరికీ నోటు పుస్తకాల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన సామగ్రిని కూడా పంపిణీ చేసినట్లు వివరించారు.

**వసతి పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సామగ్రి**

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవల్లు తదితర సామగ్రి పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**పాఠశాలలు తెరిచిన రోజే అందేలా**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పంపిణీలో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

**పది శాతం అదనపు విద్యార్థులకు ప్రణాళిక**

ప్రస్తుతం పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా మరో పది శాతం మంది విద్యార్థులు వచ్చే ఏడాది చేరే అవకాశం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. అందుకు అనుగుణంగా యూనిఫాంలు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

**నాణ్యతపై తల్లిదండ్రుల సంతృప్తి**

ఈ ఏడాది విద్యార్థులకు అందించిన యూనిఫాంలు, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇదే నాణ్యతను కొనసాగిస్తూ వచ్చే ఏడాది మరింత మెరుగైన యూనిఫాంలు, సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సమీక్షలో ఉన్నతాధికారులు**

ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి సకాలంలో అందేలా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

# తెరవెనుక చదరంగం

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు, సంచలన తీర్పులు, వ్యూహాత్మక దాడులతో నేతల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి ఖైరతాబాద్ ఉపఎన్నిక సమీకరణాల వరకు, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి వేసిన అడుగులు బీఆర్ఎస్, బీజేపీలను ఎలా ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టాయి? తెరవెనుక చదరంగం.. తెరముందు రాజకీయ కురుక్షేత్రం. జంపింగ్ ల జాతరకు బ్రేక్ వేస్తూ దానం నాగేందర్ రూపంలో పడిన సంచలన తీర్పు తెలుగు రాష్ట్రాల రాజకీయాన్ని ఒక్కసారిగా ఉలికిపడేలా చేసింది. ఖైరతాబాద్ ఉపఎన్నిక రణభూమిలో అధికార కాంగ్రెస్ వ్యూహం ముందు ప్రత్యామ్నాయ పార్టీలు ఎలా అడ్డంగా బుక్కయ్యాయి? అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి వేసిన రాజకీయ పావులు గులాబీ శిబిరాన్ని ఎలా ఆత్మరక్షణలోకి నెట్టాయి? ఎర్రవెల్లి భూముల సర్వే నుంచి ఏపీ స్థానిక పోరు వరకు తెరవెనుక సాగుతున్న అసలు కథాకమామిషూ ఏమిటి?

**ఈ రాజకీయ తుఫాన్ వెనుక దాగున్న లోతైన నిజాలపై.. మహా పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**





కేసీఆర్ జోలికి వెళ్ళాలంటే tఅంటే ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్, చంద్రబాబు లాంటోళ్లే ఒకటికి పదిసార్లు ఆలోచించే వారు. కానీ కేసీఆర్ కు తగ్గ చాణక్యుడు అంటే రేవంత్ రెడ్డే. ఒక్కడే వాళ్ళ ఫ్యామిలీ లీడర్లందరినీ కట్టకట్టి కౌంటర్ ఇస్తున్నడని సోషల్ మీడియాలో మోత మోగుతోంది. గత రెండున్నరేళ్ళుగా విమర్శలు, తిట్లకే పరిమితమైన సీఎం రేవంత్ రెడ్డి ఇపుడు దూకుడు పెంచి యాక్షన్ లోకి దిగడంతో ప్రత్యర్థులు ఆత్మరక్షణలో పడ్డారు. ఇలాంటి దూకుడు గతంలో కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ప్రదర్శించేవారు. ప్రత్యర్థులకు ఏ మాత్రం ఛాన్స్ ఇవ్వకుండా ముప్పేట దాడిచేసేవారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రదర్శించిన వ్యూహం, ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేసేలా వేసిన ఎత్తుగడలతో మొత్తం రాజకీయం చేతికి చిక్కింది. రాజకీయ చదరంగంలో తన ఎత్తులు ఎంత పదునుగా ఉంటాయో, తన పావులు ఎంత వేగంగా కదులుతాయో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి చాటారు. అసెంబ్లీ సమావేశాలు ప్రకటించిన సమయంలో ప్రభుత్వంపై ప్రతిపక్షాల అప్పర్ హ్యాండ్ ఉండేది. ఓవైపు కొండా సురేఖ ఎపిసోడ్ చర్చ, పార్టీలో అక్కడక్కడా సన్నాయి రాగాలు, 22ఏ కారణంగా రాష్ట్రంలోని భూములన్నీ మారిపోయాయంటూ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర దాడి, ఓ వైపు కేటీఆర్, మరోవైపు హరీష్ మంత్రి పొంగులేటిపై, సీఎం కుటుంబసభ్యులపై ఆరోపణల దాడి, ఇంకోవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలు, ప్రభుత్వ ఉద్యోగుల హెచ్చరికలు అన్నీ అసెంబ్లీ సమావేశాల వేళ పక్కకు పోయేలా చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తనదైన చాణక్యం ప్రదర్శించారు. ఇవన్నీ చేయడంతో పాటు కేసీఆర్ ఫామ్ హౌస్, జన్వాడ ఫామ్ హౌస్, హరీష్ భూముల వ్యవహారాన్ని ప్రజల్లో ఎక్స్ పోజ్ చేసేందుకు కమిటీలు, ప్రజాప్రతినిధుల పర్యటనల పేరుతో దీనిపై చర్చ పెట్టారు. తెరువెనుక చదరంగంతో తెరముందు రణక్షేత్రాన్ని సీఎం రచించారు.

ఓవైపు రాజకీయ చదరంగంతో ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేసిన సంధ్భంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయమైంది. ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటువేయగా, సోమవారం కోర్టులో అడ్మిట్ కాకుంటే.. ఇక ఉప ఎన్నిక ఖాయమనుకోవొచ్చు. యుద్దానికే కాంగ్రెస్ సై అంటోంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉంది. దానం నాగేందర్ మాస్ ఇమేజ్, తొమ్మిది ఎన్నికలు ఎదుర్కొన్న అనుభవం ఆయనకు కలిసిరానుంది. వీటికితోడు అధికారపార్టీ, ఎంఐఎం మద్దతు వంటి అంశాలన్నీ ఎన్నిక జరిగినా దానంకే అడ్వాంటేజ్ కానుంది. ఈ ఎన్నిక జరగడం వల్ల సిటీలో కాంగ్రెస్ పార్టీకి మరింత పట్టు, జీహెచ్ఎంసి ఎనన్నికల నిర్వహణకు కావాల్సినంత బూస్ట్ లభించనుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన వెంటనే జీహెచ్ఎంసి ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ ను జీహెచ్ఎంసిలో కూడా విజయం పలకరించే అవకాశాలున్నాయి. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండు ఉప ఎన్నికలు సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ రాగా రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది. ఇపుడు మూడో ఉప ఎన్నిక వచ్చినా ఫలితం సేమ్ రిపీట్ అవుతుందన్న అంచనాలు, సర్వేలు చెబుతున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయించామని బీఆర్ఎస్, బీజేపీ సంతోషపడుతున్నా, నైతికంగా విజయం సాధించినా.. భవిష్యత్ రాజకీయాల రీత్యా ఇది కాంగ్రెస్ కు వరమేనంటున్నారు. సిటీలో కాంగ్రెస్ పార్టీకి మరింత పట్టు వచ్చేందుకు ఈ ఎన్నిక దోహదడనుంది. భౌగోళిక, రాజకీయ పరిస్థితుల రీత్యా దానంకు కలిసివచ్చే అవకాశాలు అనేకం ఉన్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదుల సంఖ్యలో ఎమ్మెల్యేలు పార్టీలు మారినా.. అనర్హత వేటుపడ్డ ఒకే ఒక్క నాయకుడు దానం నాగేందర్. దానం నాగేందర్ రాజకీయ జీవితంలో పార్టీ మార్పు, అనంతరం ఉపఎన్నికను ఎదుర్కొన్న సందర్భం గతంలోనూ ఉంది. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన టీడీపీ అభ్యర్థిగా ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆ తర్వాత టీడీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన ఆసిఫ్‌నగర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మొహమ్మద్ మోజమ్ ఖాన్ చేతిలో 2,110 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే పార్టీ మారి, ఉపఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా దానం నాగేందర్ తన రాజకీయ ప్రాబల్యాన్ని కొనసాగించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. దానం నాగేందర్‌ను బాగా ఆదరించారు. ఆసిఫ్ నగర్ ఉపఎన్నికలో ఓడిపోయి అసెంబ్లీకి దూరమైనప్పటికీ.. హైదరాబాద్ నగర రాజకీయాల్లో దానం నాగేందర్‌కు ఉన్న పట్టును గుర్తించిన వైఎస్సార్ ఆయనను గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ (జీహెచ్‌సీసీ) అధ్యక్షుడిగా నియమించారు. 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా లేకపోయినా.. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు, జీహెచ్ఎంసీ రాజకీయాలను నడిపించే పూర్తి బాధ్యతను దానం నాగేందర్‌కే వైఎస్సార్ అప్పగించారు. ఇక 2009 ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత.. దానం నాగేందర్‌కు ఖైరతాబాద్ అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలవడంతో వైఎస్సార్ తన మంత్రివర్గంలోకి తీసుకొని కార్మిక, ఆరోగ్య శాఖల మంత్రిగా పదవిని కట్టబెట్టారు. ఇపుడు మళ్ళీపోటీచేసి గెలిస్తే ఆయన రెండోసారి మంత్రి కావడం ఖాయమే. దానం నాగేందర్ ను హైదరాబాద్ మేయర్ చేస్తారన్న ప్రచారమూ ఉంది. ఖైరతాబాద్ లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థల కొరత లేదు. విజయారెడ్డి, రోహిణ్ రెడ్డి వంటి అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుండి మన్నె గోవర్ధన్ రెడ్డి, దాసోజు శ్రవణ్, తలసాని సాయికిరణ్ వంటి నేతల పేర్లపై ఆ పార్టీ సర్వే జరుపుతోంది. బీజేపీ నుండి చింతల రామచంద్రారెడ్డి, కీర్తిరెడ్డి, పద్మ వంటి పేర్లు వినబడుతున్నాయి. అభ్యర్థులు ఎవరైనా హైదరాబాద్ సిటీలో అధికారపార్టీ వైపు మొగ్గు చూపడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యమంత్రి ఎత్తుగడలు, రాజకీయ అడుగులు ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కు అనుకూల సమీకరణను సెట్ చేశాయి. ఖైరతాబాద్ ఎన్నిక ద్వారా .జీహెచ్ఎంసిని కూడా సీఎం కొట్టేసే అవకాశాలున్నాయి,. ఎన్నిక ముగిసిన అనంతరమే సిటీలో హీట్ రగలనుంది.

కేసీఆర్ తొలి టర్మ్ అధికారంలోకి వచ్చిన సందర్భంలోనూ టీఆర్ఎస్ కు సిటీపై పట్టు లేకపోగా, కేసీఆర్ ఎంతో శ్రమపడి.. ఎంతోమంది టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకొచ్చి గ్రేటర్ పై గులాబీ జెండా ఎగరేశారు. ముఖ్యమంత్రి అధికారాన్ని గ్రేటర్ లో ఒకటి హైడ్రా, రెండు ఉప ఎన్నికలే రక్షిస్తున్నాయన్న వాదనలూ ఉన్నాయి. ముఖ్యమంత్రి వెయ్యిరోజులు పాలనను పూర్తిచేసుకున్న తరుణంలో బీఆర్ఎస్ తలపెట్టిన కార్యక్రమాలు సీఎం అఫెన్స్ తో ఉత్సాహం నింపలేకపోయాయి. ఒకరకంగా క్యాడర్ లో భయాందోళనను కలిగించాయి. భవిష్యత్తుపై అపనమ్మక శంక కలిగేలా చేశాయి, ముఖ్యమంత్రిగా కేసీఆర్ తొలి విడతలో టీడీపీ, కాంగ్రెస్ లకు చెందిన 19మందితో పాటు సీపీఐ ఎమ్మెల్యేను కూడా బీఆర్ఎస్ లో చేర్చుకున్నారు. రెండో విడతలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 12మంది ఎమ్మెల్యేలను విలీనం చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల విలీనానికి ప్రయత్నించినా బీఆర్ఎస్ సంఖ్య ఎక్కువగా ఉండడం, ఆ పార్టీ అన్నివైపులా ఒత్తిడి పెంచడంతో పదో నెంబర్ దగ్గరే ఇవి నిలిచిపోయాయి. బీఆర్ఎస్ తో పాటు బీజేపీ కూడా సుప్రీంకోర్టులో, హైకోర్టులో గట్టిగా న్యాయపోరాటం చేసి గెలిచాయి. దానం నాగేందర్ పై అనర్హత వేటు అంశంతో రెండు రాష్ట్రాల్లోనూ భవిష్యత్తులో జంపింగ్ జపాంగ్ లు మరింత అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంది. రూటు మార్చకతప్పని పరిస్థితి దీని ద్వారా ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ లోనూ టీడీపీ, వైసీపీలు ఇదే తరహా రాజకీయం చేసి నష్టపోయాయి. అయినా అన్ని పార్టీల తీరు అదే. ఒక్క బీజేపీ మాత్రమే తన పార్టీలో ఎవరు చేరినా రాజీనామా చేసి రావాలన్న కండిషన్ పెట్టింది. అలా ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు రాజీనామాలు సమర్పించి బరిలో నిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ సూత్రాలేవీ పట్టించుకోలేదు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదినరేళ్ళ అధికారంలో ఉన్న సమయంలో ప్రత్యర్థులను అష్ట దిగ్బంధనం చేయగా, ఈటల రాజేందర్ వంటి వారి వ్యక్తిగత ఆస్తులపై కూడా అధికారాన్ని ప్రయోగించింది. రాజకీయాల్లో ఎవరి వ్యూహాలు, ఎత్తుగడలు వారికి ఉంటాయి. లక్షలాది మంది కార్యకర్తలు నమ్ముకున్న పార్టీని, సాధించిన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు కొన్నిసార్లు యుక్తితో, కొన్ని సార్లు దండనతో, కొన్ని సార్లు టక్కుటమార విద్యలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి కాగానే ఢిల్లీకి తన రాజకీయ యుక్తితో నమ్మకం కలిగించిన రేవంత్ రెడ్డి, ఇపుడు స్టేట్ లో గేమ్ మొదలుపెట్టినట్లు కనబడుతోంది. రెండేళ్ళముందే ఆటకు సై అంటుండడం ఆసక్తికరంగా మారింది. ఏపీలో స్థానిక ఎన్నికలు అధికారపక్షానికే అనుకూలంగా ఉండనుండగా, మిత్రుల మధ్య సీట్ల సర్దుబాటే పెద్ద సమస్య కానుంది. సర్దుబాట్లు సాఫీగా జరగకుంటే భవిష్యత్తు ఎన్నికలపైనా దీని ఎఫెక్ట్ పడనుంది.

# పొన్నం పట్టుదల.. ఉత్తర తెలంగాణకు హైవే కళ

(మహా ప్రత్యేకం)

ఒక రహదారి అంటే కేవలం గమ్యాన్ని చేరుకునే దారి కాదు.. ప్రజల సమయాన్ని ఆదా చేసే బాట, పల్లెలను పట్టణాలతో కలిపే వారధి, వ్యాపారానికి ఊపిరి, అభివృద్ధికి రాచబాట. నేడు ఉత్తర తెలంగాణ ప్రజలకు అలాంటి కొత్త బాటగా ఎన్ హెచ్ 563 రూపుదిద్దుకుంటోంది. వరంగల్-కరీంనగర్-జగిత్యాల మధ్య ప్రయాణించే ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం అందించాలన్న ఆలోచనతో నాడు ఎంపీగా పొన్నం ప్రభాకర్ చేసిన ప్రయత్నాలు.. నేడు హైవే రూపంలో ప్రజల ముందుకొస్తున్నాయి. నాడు ప్రజల అవసరాన్ని గుర్తించిన ఆలోచన.. నేడు ప్రజల ప్రయాణానికి అందుబాటులోకి వస్తున్న రహదారి. ఈ జాతీయ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ప్రాంతాల మధ్య అనుసంధానం, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుంది.

అభివృద్ధి ఫలాలు ఒక్కరోజులో కనిపించవు.. భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి వేసిన అడుగులు కాలక్రమంలో ఫలితాలుగా మారుతాయి. వరంగల్-కరీంనగర్-జగిత్యాల మార్గాన్ని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా ఇప్పుడు అదే విధంగా కార్యరూపం దాల్చుతోంది. నాడు ఎంపీగా ఉన్న సమయంలో ఉత్తర తెలంగాణ రవాణా అవసరాలను గుర్తించి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రయత్నాలు.. నేడుఎన్ హెచ్ 563 రూపంలో ప్రజలకు అందుతున్నాయి.

### ఎంపీగా మొదలైన ప్రయాణం.. మంత్రిగా సుసాధ్యం

పొన్నం ప్రభాకర్ రాజకీయ ప్రస్థానంలో ప్రజా సమస్యలపై పోరాటం ఒక భాగమైతే.. వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించే మౌలిక వసతుల కల్పన మరో భాగంగా నిలుస్తోంది. ఎంపీగా ఉన్నప్పుడే జాతీయ రహదారి అవసరాన్ని గుర్తించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన ఆయన.. నేడు మంత్రిగా అదే మార్గంలోని మిగిలిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. నాడు ఎంపీగా వేసిన అడుగు.. నేడు హైవేగా సాకారం అవుతోంది. ఉత్తర తెలంగాణ రవాణా వ్యవస్థకు మరింత బలం చేకూర్చే ఎన్ హెచ్ 563.. పొన్నం ప్రభాకర్ ముందుచూపు, నిరంతర ప్రయత్నాలకు ప్రతిరూపంగా నిలుస్తోంది.

పొన్నం ప్రభాకర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో నే వరంగల్ నుంచి కరీంనగర్ మీదుగా జగిత్యాల వరకు ఉన్న ప్రధాన రహదారి ప్రాధాన్యతను గుర్తించారు. ఉత్తర తెలంగాణ లోని ముఖ్య ప్రాంతాలను అనుసంధానించే ఈ



మార్గాన్ని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పలు మార్లు లేఖలు రాస్తూ ఈ మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రాంత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాడు చేసిన ఈ ప్రయత్నం.. ఆ తర్వాత తీసుకున్న నిర్ణయాలకు పునాది వేసింది. పొన్నం ప్రభాకర్ లేఖలకు స్పందిస్తూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ 2016 మే 24న అధికారికంగా లేఖ జారీ చేసింది. ఈ మార్గాన్ని మార్చి 2014లోనే NH563గా ప్రకటించినట్లు, సుమారు 130 కిలోమీటర్ల మేర 4లే న్ రహదారిగా అభివృద్ధి చేసేందుకు NHAIకి అప్పగించినట్లు నాటి కేంద్ర కార్యదర్శి సంజయ్ మిత్ర ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో వరంగల్-కరీంనగర్-జగిత్యాల మార్గానికి జాతీయ రహదారి హోదా రావడంతో పాటు అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది.

**వరంగల్–కరీంనగర్ హైవే అందుబాటులోకి..**

NH563లో భాగంగా వరంగల్-కరీంనగర్ మధ్య హైవే నిర్మాణం పూర్తై ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఉత్తర తెలంగాణలోని రెండు ప్రధాన ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతమైంది. ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు మార్గమధ్యంలోని ప్రాంతాల అభివృద్ధికి కూడా ఈ రహదారి దోహదపడుతోంది. నాడు ఎంపీగా పొన్నం ప్రభాకర్ చేసిన ప్రయత్నానికి ఈ హైవే ఒక ప్రత్యక్ష ఫలితంగా నిలుస్తోంది. ఎన్ హెచ్ 563లో కరీంనగర్-జగిత్యాల మధ్య మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. ఈ మార్గంలో ఉన్న సాంకేతిక, ఇతర అడ్డంకులను తొలగించి పనులను వేగవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లారు. మిగిలిన పనులు కూడా పూర్తయితే వరంగల్-కరీంనగర్-జగిత్యాల మధ్య పూర్తిస్థాయి జాతీయ రహదారి అనుసంధానం అందుబాటులోకి రానుంది.







# ఉచిత పోలీస్ ఉద్యోగాల కోచింగ్

- పట్టుదలతో శ్రమించాలి
- కలెక్టర్ రాజర్షి షా సూచన

**ఆదిలాబాద్ మహా** : నిశ్చిత లక్ష్యంతో శ్రమిస్తే విజయం సాధించడం తథ్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం స్థానిక బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ ఉద్యోగాల కోచింగ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్లో శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన కానిస్టేబుల్ లను కలెక్టర్ సన్మానించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కేవలం 20 నుంచి 25 రోజుల్లోనే అధికారుల బృందం సమన్వయంతో మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ శిక్షణ కోసం మొత్తం 465 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రతిభ ఆధారంగా 200 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు మనసులోని భయాన్ని పూర్తిగా విడనాడి, లక్ష్యసాధనపైనే పూర్తిగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అర్హత, ప్రతిభ ఉన్నందుకే ఈ శిక్షణకు ఎంపికయ్యారని, స్టడీ సర్కిల్లో అవసరమైన డిజిటల్ బోర్డులు, నాణ్యమైన స్టడీ మెటీరియల్, అవసరమైన ఫర్నిచర్ వంటి అన్ని వసతులను ప్రభుత్వం సమకూరుస్తోందని తెలిపారు. రెండు నెలల పాటు సాగే తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ నోట్స్ తయారు చేసుకోవాలని, సందేహాలు వస్తే సంకోచించకుండా ఫ్యాకల్టీని అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు రేపు యూనిఫామ్ ధరించి విజేతలుగా నిలిచి, భావి తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు రమేష్, ప్రవీణ్ కుమార్, ఫ్యాకల్టీ రమణ, మోటివేటర్ సల్ల విజయ బాబు, స్టడీ సర్కిల్ సిబ్బంది, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.




# గోండు గూడ లో పోలీసులు మీకోసం

- హాజరైన ఎస్పీ అఖిల్ మహాజన్
- ప్రజలకు పలు సూచనలు

**ఆదిలాబాద్ మహా**: ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం కోసం నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం నార్నూర్ మండలం గుండాల గోండు గూడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు అవగాహన కల్పించారు. మనలో మార్పు వల్లే గంజాయిని సమాజం నుంచి దూరం చేయవచ్చన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని సూచించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 50 పుస్తకాలు పెన్నులను అందజేసారు..మూఢ నమ్మకాలు, ట్రాఫిక్ నియమాలు, మంచి ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న గ్రామానికి త్వరలోనే ఒక ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను అందజేస్తామని, గ్రామ పంచాయతీ తరుపున సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు లో నిష్ణాతులైన వైద్యుల బృందంచే ఉచితంగా వైద్యచికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, నార్నూర్ సీఐ అంజమ్మ, ఎస్సై శ్రీ సాయి, గాదిగూడ ఎస్ఐ రమ్య, డాక్టర్లు అశోక్, రమా అశోక్, గోపాల్, తౌఫిక్, వంశీ, చంద్రకాంత్, గ్రామ సర్పంచ్ రాథోడ్ సురేష్, పటేల్ కుమ్రా మాల్కో, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సుమారు 200 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్
- డిజిటల్ భూ రీ సర్వే పనుల పరిశీలన



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. భద్రాద్రి జిల్లాలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టీ నగర్ రెవెన్యూ విలేజ్ అంజనాపురం ప్రాంతంలో డిజిటల్ భూ రీ సర్వే పనుల జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సర్వేలో అనుసరిస్తున్న విధానం భూముల కొలతలు వివరాల నమోదు తదితర అంశాలను బూర్గంపాడు తహసీల్దార్ ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత లైసెన్సు సర్వేయర్లు యుగేందర్, అనూష లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో 118 సర్వే నెంబర్ లో 1863 ఎకరాలకు గాను 1698 ఎకరాలు రీ సర్వే పూర్తయిందని జిల్లా కలెక్టర్ కు సర్వేర్లు తెలియజేశారు. అటవీశాఖకు సంబంధించిన భూములు సుమారు 200 ఎకరాలు ఉండగా వాటికి అనుమతులు వస్తే సరిహద్దులు సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక రైతులు తమ్మినేని వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, కొట్టే వెంకటేశ్వర్లు, భానోత్ రాజు, దాసరి ఆదినారాయణ జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించి వారి అభిప్రాయాలు సమస్యలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు మరింత కచ్చితంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు సర్వే సిబ్బంది రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో పినపాక పట్టీ నగర్ సర్పంచ్ బాణోత్ పద్మ, ఉప సర్పంచ్ వెంకటరమణ, అధికారులు, సిబ్బంది స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



# శోభాయమానంగా గణేష్ నవరాత్రోత్సవాలు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలో వినాయక నవరాత్రోత్సవాలు అట్టహాసంగా శోభాయమానంగా సాగుతున్నాయి. పట్టణంలోని వివిధ మండపాలలో గణనాధులు కొలువై భక్తులచే పూజలందుకుంటున్నారు. భక్తులను ఆకట్టుకునేవిధంగా ఆయా మండపాల నిర్వాహకులు వైభవంగా అలంకరణలు చేసారు. పౌరాణిక ఇతిహాసాలను గుర్తుకుతెచ్చే భారీ సెట్టింగులు కళ్లు మిరుమిట్లు గొలిపే లైటింగ్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి.దాదాపు అన్ని మండపాల వద్ద రంగరంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసారు. సందర్శించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేసారు. అటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## పందిల్లలో ఆరోగ్య శిబిరం



**పెద్దపల్లి మహా, కాల్వ శ్రీరాంపూర్ :** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పందిల్ల గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఆరోగ్య శాఖ అధికారులు, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎక్రే సౌకర్యంతో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఎక్రే సౌకర్యాన్ని కూడా ప్రజలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, ఉప సర్పంచ్ దర్ముల రవి, మాజీ ఎంపీటీసీ రావి సదానందం, గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్, హెచ్.వి సూపర్వైజర్ నీరజ, డి ఈ ఓ ప్రకాష్, ఎంపీహెచ్ఏ సరిత, వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్ గౌడ్, కొత్తగట్టు కళ్యాణి, మధు, ఆశా వర్కర్లు ఇల్లందుల వాసవి, వరలక్ష్మి, ఎక్రే టెక్నీషియన్ రాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులకు అవసరమైన ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై నిర్వాహకులు దృష్టి సారించారు.

## శ్రీరాంపూర్‌లో ఆర్టీవో అధికారుల వాహన తనిఖీలు

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆర్టీవో అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో మండల పరిధిలోని పలు వాహనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. తనిఖీల్లో ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.



## చినరాయిగూడెంలో డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలన...

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఏఈఓ డాక్టర్ లక్ష్మణరావు**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని చినరాయిగూడెం గ్రామంలో చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం కొమరం లక్ష్మణరావు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాలంటీర్ కొమరం మధుకిరణ్ ఆధ్వర్యంలో గ్రామంలో సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా నిర్దేశించిన ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన పొలాన్ని వాలంటీర్ నేరుగా సందర్శించి, సాగులో ఉన్న పంటను పరిశీలించి ఫోటో తీస్తున్నారు. అనంతరం పంట వివరాలతో పాటు ఫోటోలను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను పరిశీలించిన ఏఈఓ డాక్టర్ కొమరం లక్ష్మణరావు సర్వే నంబర్ల వారీగా పంటల వివరాలు, ఫోటోల నమోదును తనిఖీ చేశారు. రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న పంటల వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలని, సర్వే ప్రక్రియను ఖచ్చితంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తెల్లం నర్సింహారావు, కుంజ భద్రయ్య, కుంజ క్రిష్టయ్య, సత్యం, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# త్రీ వీలర్ స్కూటీ ఇస్తే.. కుటుంబానికి నేనే అండ!

- 12 ఏళ్లుగా మంచానికే పరిమితం..
- కిరాణా వ్యాపారం చేసుకుంటానంటున్న శ్రీనివాస్
- "మీ హామీ కోసం.. మీ ఫోన్ కాల్ కోసం ఎదురుచూస్తున్నా"



**పెద్దపల్లి మహా :** సుల్తానాబాద్: విధి చేసిన గాయం 12 ఏళ్లుగా మంచానికే పరిమితం చేసింది.. కానీ కుటుంబాన్ని తానే పోషించుకోవాలన్న పట్టుదలను మాత్రం దూరం చేయలేకపోయింది. దానం కోసం కాదు.. తన కాళ్లపై తాను నిలబడి కుటుంబానికి అండగా నిలిచేందుకు ఒక అవకాశం ఇవ్వాలని సుల్తానాబాద్ మండలం కదంబాపూర్‌కు చెందిన గోస్కుల శ్రీనివాస్ వేడుకుంటున్నారు. సుమారు 12 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెన్నుముకకు తీవ్ర గాయం కావడంతో శ్రీనివాస్ అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. శారీరకంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ.. కుటుంబంపై భారం కాకుండా తనకు సాధ్యమైన మార్గంలో ఉపాధి పొందాలన్న తపనతో ఉన్నారు.

**త్రీ వీలర్ ఇస్తే.. కిరాణా వ్యాపారం**

తన పరిస్థితిని వివరిస్తూ సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యేను శ్రీనివాస్ వేడుకున్నారు. తనకు త్రీ వీలర్ స్కూటీ అందిస్తే దానిపై కిరాణా సరుకులు విక్రయిస్తూ చిన్న వ్యాపారం నిర్వహించుకుంటానని ఆయన తెలిపారు. తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని తానే పోషించుకుంటానని పేర్కొన్నారు. "నా పేరు శ్రీను. రోడ్డు ప్రమాదంలో వెన్నుముక విరిగి 12 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాను. త్రీ వీలర్ స్కూటీ ఇప్పిస్తే కిరాణా పెట్టుకుని నా కుటుంబాన్ని పోషించుకుంటా.

ఒక్క అవకాశం ఇవ్వండి" అంటూ శ్రీనివాస్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

**"హామీ ఇచ్చారు.. ఫోన్ కాల్ కోసం ఎదురుచూస్తున్నా"**

తనకు త్రీ వీలర్ స్కూటీ అందిస్తామని గతంలో హామీ ఇచ్చారని శ్రీనివాస్ తన పోస్టులో పేర్కొన్నారు. ఆ హామీ నెరవేరుతుందన్న ఆశతో ఇప్పటికీ ఎదురుచూస్తున్నానని తెలిపారు. "మీ ఫోన్ కాల్ కోసం ఎదురుచూస్తున్నా" అంటూ ఎమ్మెల్యేను మరోసారి అభ్యర్థించారు. గత కొన్ని నెలలుగా తన సమస్యను సోషల్ మీడియా ద్వారా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ తనకు ఇంకా సహాయం అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్క వాహనం.. ఓ కుటుంబానికి జీవనాధారం**

శ్రీనివాస్ కోరుతున్న త్రీ వీలర్ స్కూటీ ఆయనకు కేవలం ప్రయాణ సాధనం కాదు.. స్వయం ఉపాధికి మార్గం, కుటుంబ పోషణకు ఆధారం. దానిపై చిన్న కిరాణా వ్యాపారం నిర్వహించుకుని తన జీవనాన్ని తానే సాగించాలన్నది ఆయన లక్ష్యం.12 ఏళ్లుగా మంచానికే పరిమితమైనప్పటికీ "నాకు సహాయం కాదు.. ఒక అవకాశం కావాలి" అనే శ్రీనివాస్ విజ్ఞప్తి ఇప్పుడు ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆయన పరిస్థితిని పరిశీలించి త్రీ వీలర్ స్కూటీ అందించేందుకు సహకరిస్తే.. ఒక కుటుంబానికి జీవనాధారం లభించినట్లవుతుందని స్థానికులు కోరుతున్నారు.

# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు!

అమర ప్రసాద్‌పై పోలీసుల చర్యలను స్వాగతించిన అంబేద్కర్ సంఘాల నాయకులు

పెద్దపల్లి మహా : కాల్వ శ్రీరాంపూర్ :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కల్పిత పుస్తక రచనకు ప్రయత్నించారనే ఆరోపణల నేపథ్యంలో అమర ప్రసాద్‌పై తెలంగాణ పోలీసులు తీసుకున్న చర్యలను అంబేద్కర్ సంఘాల నాయకులు స్వాగతించారు. మహనీయుల గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంబేద్కర్ అందించిన రాజ్యాంగం, దాని ద్వారా దేశ ప్రజలకు లభించిన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి హక్కులను వారు గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అమర ప్రసాద్‌పై పోలీసులు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. అయితే భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అసత్య, అవమానకర వ్యాఖ్యలు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**పరువునష్టం దావా వేయాలి**

అమర ప్రసాద్‌పై పరువునష్టం దావా వేయాలని నాయకులు ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు. మహనీయుల గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల్లో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

**రాజ్యాంగ విలువలను కాపాడాలి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలకు పునాది వేసిందని నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల రాజేశం, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కల్లపల్లి విజయసాగర్, ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్, మాజీ సర్పంచ్ సిరికొండ కొమురయ్య, ఆర్టీఐ చట్టం పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి ఉయ్యాల ఓదెలు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు ఉమామహేశ్వర్, ఆర్టీఐ చట్టం పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ కుంట శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి చిలుముల రామస్వామి, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ నిశాంత్, ఆర్టీఐ చట్టం జిల్లా కార్యదర్శి దొమ్మటి హరీష్, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు జిలుకర రాకేష్, తిరుమల రాజేష్, తాండ్రాజు తదితరులు పాల్గొన్నారు.





## ట్రాఫిక్ నియంత్రణకు కొత్త ఔట్‌పోస్టులు

- తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో నూతన ట్రాఫిక్ బూత్‌లు ప్రారంభం

**కరీంనగర్ మహా:** నగరంలోని కీలక కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల రాకపోకల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వీటిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రద్దీ ప్రాంతాలపై నిరంతర నిఘా ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నియంత్రించడంతో పాటు, వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించేందుకు ఔట్‌పోస్ట్ బూత్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితులపై నిరంతర నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు వాహనదారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశించారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామితో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎరువుల షాపులపై నామమాత్రపు తనిఖీలేనా?

- చిన్న దుకాణాలపైనే కొరడా.. పెద్ద దుకాణాలపై ఎందుకు మౌనం?
- భారీ లావాదేవీల ఆరోపణలపై లోతైన తనిఖీలు ఎప్పుడు?

**పెద్దపల్లి మహా, :** పెద్దపల్లి జిల్లాలో ఎరువుల విక్రయ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లాలోని కొన్ని పెద్ద ఎరువుల దుకాణాల్లో భారీగా లావాదేవీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో.. ఆయా దుకాణాల్లో అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా చిన్న, మధ్యతరహా దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు.. భారీగా వ్యాపారం జరిగే దుకాణాల్లోనూ అదే స్థాయిలో తనిఖీలు చేస్తున్నారా? అనే ప్రశ్నలు వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పెద్ద దుకాణాల లావాదేవీలపై ఆరా ఎక్కడ?

ఎరువుల విక్రయాల్లో స్టాక్ రిజిస్టర్లు, విక్రయ బిల్లులు, పీఓఎస్ లావాదేవీలు, భౌతిక నిల్వలు తదితర అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ముఖ్యంగా భారీగా వ్యాపారం జరిగే దుకాణాల్లో రికార్డుల్లో చూపుతున్న నిల్వలకు, వాస్తవ నిల్వలకు మధ్య తేడాలు ఉన్నాయా? బిల్లులు, పీఓఎస్ లావాదేవీల్లో ఏమైనా వ్యత్యాసాలు ఉన్నాయా? అనే అంశాలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

**చిన్న షాపులకే తనిఖీలు.. పెద్దవారికి మినహాయింపులా?**

నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యతే. అయితే నిబంధనలు అన్ని దుకాణాలకు సమానంగా వర్తిస్తున్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది.చిన్న దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తూ చర్యలు తీసుకుంటున్న అధికారులు.. భారీ లావాదేవీలు జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న పెద్ద దుకాణాల్లోనూ అదే స్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్హత ఒకరిది.. దుకాణం నిర్వహణ మరొకరిదా? ఇదిలా ఉండగా.. ఎరువుల దుకాణాల నిర్వహణలో లైసెన్స్, విద్యార్హతలకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. విద్యార్హత కలిగిన వ్యక్తుల పేర్లతో లైసెన్సులు పొంది.. వాస్తవంగా వేరే వ్యక్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉంటే, వాటిపై కూడా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.లైసెన్స్ ఎవరి పేరుతో ఉంది? దుకాణాన్ని వాస్తవంగా ఎవరు నిర్వహిస్తున్నారు? రైతులకు ఎరువుల వినియోగం, మోతాదు, విధానం తదితర వివరాలను ఎవరు తెలియజేస్తున్నారు? విక్రయాలు నిర్వహిస్తున్న వ్యక్తికి నిబంధనల ప్రకారం అవసరమైన అర్హతలు ఉన్నాయా? అనే అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.కనీస విద్యార్హతలు కూడా లేని వ్యక్తులు ఎరువుల దుకాణాల్లో విక్రయాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే.. రైతులకు ఎరువుల వినియోగంపై సరైన సమాచారం ఎలా అందుతుంది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారుల తనిఖీల్లో వాస్తవాలు వెల్లడించాల్సి ఉంది.

**పట్టుకున్న లెక్కలు వెల్లడిస్తున్నారా?**

తనిఖీల సమయంలో అధికారులు గుర్తిస్తున్న స్టాక్ తేడాలు, అక్రమ నిల్వలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో వెల్లడిస్తున్నారా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. తనిఖీల్లో తప్పులు గుర్తించినప్పటికీ.. సంబంధిత వ్యాపారులపై వివిధ స్థాయిల్లో ఒత్తిళ్లు రావడంతో చర్యలు లేకుండానే వదిలేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవమెంత అన్నది వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. అధికారులు గుర్తించిన కేసుల్లో ఎంత స్టాక్ తేడా ఉంది? ఎంత విలువైన ఎరువులను స్వాధీనం చేసుకున్నారు? ఎవరిపై కేసులు లేదా ఇతర చర్యలు తీసుకున్నారు? తదుపరి చర్యలు ఏమిటి? అనే వివరాలను బహిర్గతం చేస్తే తనిఖీలపై మరింత పారదర్శకత ఏర్పడే అవకాశం ఉంది.

**రైతుల ప్రయోజనమే ప్రథమ లక్ష్యం కావాలి**

ఎరువుల విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే చివరికి నష్టపోయేది రైతులేనని రైతులు పేర్కొంటున్నారు. అందువల్ల చిన్న దుకాణమా.. పెద్ద డీలరా అనే తేడా లేకుండా అన్ని దుకాణాలపై సమాన స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. భారీ లావాదేవీలు జరిగే దుకాణాలపై కూడా లోతైన తనిఖీలు నిర్వహించి.. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అక్రమాలు లేవని తేలితే ఆ విషయాన్ని కూడా అధికారులు స్పష్టంగా వెల్లడించాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే "చిన్న దుకాణాలకే నిబంధనలు.. పెద్ద దుకాణాలకు మినహాయింపులా?" అన్న అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారుల సమగ్ర తనిఖీలు, పారదర్శకంగా వెల్లడించే వివరాలే ఈ అనుమానాలకు తెరదించగలవని రైతులు పేర్కొంటున్నారు.

**అధికారుల నుంచి సమాధానాలు రావాల్సిందే..**

జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు? ఎన్ని దుకాణాల్లో స్టాక్ తేడాలు గుర్తించారు? ఎన్ని దుకాణాల పీఓఎస్ లావాదేవీలను పరిశీలించారు? ఎంత మొత్తంలో విక్రయ లావాదేవీలను తనిఖీ చేశారు? ఎన్ని బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది.



# గణేష్ నిమజ్జనం విషాదం

**రాజేంద్రనగర్, మహా:** గణేష్ నిమజ్జనం ముగించుకుని స్వగ్రామం నుంచి శంషాబాద్ వైపు తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషాద ఘటన శనివారం తెల్లవారుజామున శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలమాకుల జాతీయ రహదారి-44పై చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెట్టుగడ్డ తండా (చౌడూర్) కు చెందిన కుటుంబ సభ్యులు స్వగ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ముగించుకుని ఇన్నోవా వాహనంలో శంషాబాద్ వైపు బయలుదేరారు. పాలమాకుల సమీపంలో వాహనం అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొని బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జు కావడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో కేతావత్ లింబ్యా (54), కేతావత్ జమున (45), కత్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వాస్రామ్ (45) ఉన్నారు. డ్రైవర్ సబావత్ అశోక్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రమాద స్థలాన్ని ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.



## ఇస్కాన్ లయంలో ఘనంగా రాధాష్టమి వేడుకలు



**రాజేంద్రనగర్ మహా ;** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఇస్కాన్ ఆలయంలో రాధాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. రాధారాణి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసారు. మంగళహారతితో ప్రారంభమైన వేడుకల్లో గురుపూజ, శృంగార దర్శన హారతి, రాధారాణి లీలలపై ప్రవచనాలు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు మహా అభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం రాజభోగ హారతితో భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు.



## వినాయక చవితి వేడుకల్లో ఘనంగా సరస్వతీ పూజ

- విద్యార్థుల్లో జ్ఞానం, భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల చైతన్యం పెంపొందించడమే లక్ష్యం
- వైస్ ఛాన్సలర్ జి. శంకర్ లింగం

**మొయినాబాద్ మహా:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా చైతన్య (డీమ్డ్ టు బి) యూనివర్సిటీలో గురువారం సరస్వతీ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంతో యూనివర్సిటీ ప్రాంగణం ఆధ్యాత్మికత, భక్తిభావంతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి. శంకర్ లింగం హాజరై సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధి, జ్ఞానసంపద, సృజనాత్మకత, ప్రతిభా వికాసం, ఉజ్వల భవిష్యత్తు, విజయాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం మాట్లాడుతూ, విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తమ ప్రతిభతో సమాజానికి, దేశానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సంపాదించే జ్ఞానం కేవలం వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం కాకుండా సమాజ అభ్యున్నతికి, దేశ ప్రగతికి దోహదపడేలా ఉండాలని సూచించారు.విద్యార్థుల్లో విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అవగాహన పెంపొందించడం విద్యాసంస్థల ముఖ్య బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం, మానవీయ విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అలాగే భారతీయ సంస్కృతిలో జ్ఞానానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉందని, విద్యకు అధిదేవతగా సరస్వతీ దేవిని ఆరాధించడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం పట్ల గౌరవం, విద్య పట్ల ఆసక్తి మరింత పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సమాజ హితం కోసం వినియోగిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సుమారు 500 మంది విద్యార్థులు ఒకే వేదికపై భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొని, సరస్వతీ దేవికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమష్టిగా పాల్గొనడంతో కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీన్ అడ్మిషన్స్ డాక్టర్ సిహెచ్. ప్రత్యూష రెడ్డి, పలువురు విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సర్కార్ దవాఖానా నిర్మాణ పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యే

- ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దుతాం..
- అందుకే ప్రతీదశ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నా...
- పెద్దచెరువును టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతా...
- నియోజకవర్గంలో ప్రతీ రోడ్డు బాగుకోసం దృష్టి..
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 19 మహా**: తాను వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఏ సంకల్పంతో నిర్మిస్తున్నానో... అదే సంకల్పంతో ఇబ్రహీంపట్నం సర్కార్ దవాఖానాను నిర్మాణం చేపడుతున్నట్లు, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నంలో పర్యటించిన ఆయన... సర్కార్ దవాఖానా నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే... వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా దిశానిర్దేశం చేశారు. తాత్కాలిక దవాఖానాలో సేవలు, మౌలికసదుపాయాలు, తదితర అంశాలపై వైద్యులతో చర్చించారు.

**కార్పొరేట్ దవాఖాన తరహాలో....**

అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరుగుతుంది ఆయన తెలిపారు. పేదలకు పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ దవాఖాన తరహాలో వైద్యసేవలందించే దిశగా ఇబ్రహీంపట్నం సర్కార్ దవాఖాను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేస్తామన్న మల్‌రెడ్డి... దవాఖాన కావాల్సిన సౌకర్యాలను, వైద్యులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**పర్యాటకకేంద్రంగా పెద్దచెరువు...**

ఇబ్రహీంపట్నం పెద్దచెరువు పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దటంపై దృష్టిసారించినట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి చెప్పారు. బోటింగ్, రెస్టారెంట్ లాంటి వాటి ఏర్పాటుతో టూరిజం స్పాట్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**నిర్మాణంలో ఉన్న రోడ్లన్నీ పూర్తి చేస్తా...**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ప్రతీ గల్లీతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రోడ్ల బాగుకు దృష్టి సారించినట్లు మల్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే సర్కార్ దృష్టికి తీసుకువెళ్లానని... నిర్మాణంలో ఉన్న రోడ్లన్నీ త్వరలోనే పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి ఇబ్రహీంపట్నం ఏసిపి కెపివి రాజు, సిఐ మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, ఆర్ అండ్ బి అధికారులు, సర్కార్ దవాఖాన సూపర్డెంట్, వైద్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు రామదాసు నాయక్, ఏఎంసి డైరెక్టర్లు దొంతరమోని రాజు, తాళ్ల మహేష్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, మండల అధ్యక్షులు రావణమోని లింగం, కొంగర డివిజన్ అధ్యక్షులు చెన్నమోని రమేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతిగళ్ల మహిపాల్, రాచర్ల వెంకటేశ్వర్లు, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, తాళ్ల శ్రీశైలం గౌడ్, సిద్దంకి కృష్ణారెడ్డి మంకాల దాసు, వింజమూరి ప్రేమాకర్ రెడ్డి, ప్రశాంత్ రావు, మహిళ నాయకురాలు జయమ్మ, సత్య రాణి, కోడూరి రమేష్, వరికుప్పల సుధాకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో గణనాథుడి దర్శనం

- సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా ప్రత్యేక పూజలు

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19:** మహా పట్టణంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కల్పతరు రోడ్డులోని అవని వెంచర్ పరిసరాల్లో 16వ వార్డుకు చెందిన కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా శనివారం దర్శించుకున్నారు. ఆలయ మండపం వద్దకు చేరుకున్న ఆమెకు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గణనాథుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి కృపతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేస్తుందని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను కులమతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆమె కోరారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి, వార్డు కౌన్సిలర్లు దూదిపాళ్ల రాంబాబు, దేవి శ్రీను, విరివాడ అపర్ణ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంతు వేణు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు పెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రీయ పద్ధతులలో జీవాల పెంపకంతోనే అధిక లాభాలు

**పీవీఎన్ఆర్‌టీవీయూ నిపుణులు**

**రాజేంద్రనగర్ మహా :** పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పశువైద్య కళాశాలలోని పశుగణ క్షేత్ర సముదాయం ఆధ్వర్యంలో జీవాల (గొర్రెలు, మేకల) పెంపకంలో ఆధునిక యాజమాన్య పద్ధతులు అనే అంశంపై ఒక రోజు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలు తక్కువ పెట్టుబడితో చిన్న జీవాలైన గొర్రెలు, మేకల పెంపకంతో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చన్నారు. సీనియర్ ప్రొఫెసర్ విభాగ అధిపతి డాక్టర్ టి రఘునందన్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత యువత సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జీవాల పెంపకం చేపడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ప్రొఫెసర్ ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులతో తక్కువ ఖర్చుతో గొర్రెలు, మేకల పోషణ చేపట్టే మెలకువలను వివరించారు. వివిధ మేలు జాతుల ఎంపిక, లాభదాయకమైన పొట్టేలు పిల్లల పెంపక విధానాలపై ప్రొఫెసర్ పి అమరేశ్వర్ రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. జీవాల పెంపకం పై సమగ్ర నిర్వహణ పద్ధతుల గురించి డాసుష్మా వివరించారు అలాగే వివిధ రకాల పశుగ్రాసాల సాగు, నిల్వ పద్ధతులు దాణా ఖర్చును ఏ విధంగా తగ్గించుకోవచ్చో డాక్టర్ రామకృష్ణ తెలియజేశారు. జీవాలకు సోకే వివిధ వ్యాధులు, వాటి లక్షణాలు, సకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త నివారణ చర్యలు, టీకాల ప్రాధాన్యత విషయలను ప్రొఫెసర్ కె లక్ష్మి తెలిపారు. డాక్టర్ సీహెచ్ శివకుమార్ శిక్షణార్థులను క్షేత్రస్థాయిలో జీవాల ఫారమ్‌కు తీసుకెళ్లి ప్రత్యక్ష శిక్షణ ఇచ్చి వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారూ. ఈ కార్యక్రమంలో దాదాపు 130 మంది యువ రైతులు, ఔత్సాహికులు పాల్గొనీ భవిష్యత్తులో ఇలాంటి ప్రయోజనకరమైన శిక్షణ కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు.



## పల్లె చెరువులో నిమజ్జనం.. తూతూమంత్రంగా ఏర్పాట్లు

- నిమజ్జనం ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేసిన.
- బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్...

**రాజేంద్రనగర్ మహా ;** బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ఆధ్వర్యములో బి ఆర్ ఎస్ నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులతో కలిసి రాజేంద్రనగర్ అత్తాపూర్,సర్కిల్ లోని పలు చెరువులో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. జిహెచ్ఎంసి అధికారులు నిమజ్జనం ఏర్పాట్లను తూతూ మంత్రంగా నిర్వహించారని బిఆర్ఎస్ నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె చెరువులో నిమజ్జనం కోసం ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించి చుట్టుపక్క ప్రాంతాలు శుభ్రంగా ఉండేవి. భారీ క్రేన్ల సంఖ్య పెంచి గజ ఈతగాళ్లతో పాటు పోలీసు సిబ్బందిని ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండామంచినీటి సౌకర్యం కల్పించేవారు. వినాయకుల విగ్రహాలు మునిగే లాగ నీటికొలనులను ఏర్పాటు చేసేరు. ప్రస్తుతం పల్లెచెరువు లో నిమ్మజనం కోసం పట్టుమని ఐదు గణేష్ విగ్రహాలు మునగ లేని కొలనును ఏర్పాటు చేశారు. దానితో ఈసారి ప్రజలకు, మండప నిర్వాహకులకు అసౌకర్యం కలిగే లాగానే ప్రభుత్వ ఏర్పాట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీరు జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యంపై బిఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులుసు భాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్, గుమ్మడి కుమార్, నరేందర్ ముదిరాజ్,రాము యాదవ్, మైసిరెడ్డి, రాఘు యాదవ్,రాజేష్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం ,జగదీష్, రామస్వామి, భగవాన్ దాస్, చిరంజీవి, ఉమారెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, క్రాంతి ,సింహాచలం,రిషి, శ్రీశైలం నరసింహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడి పూజలో పోలీస్ అధికారులు..

**రాజేంద్రనగర్ మహా ;** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని కొత్వాల్ కూడా డివిజన్ కిషన్ గూడా సెవెన్ హిల్స్ టౌన్షిప్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపానికి శంషాబాద్ ఆర్జిఐఏ సీఐ సంజీవులు, ఎస్సైలు శ్రీధర్, గోపాల్ లంబోధరున్ని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు పార్టీల నాయకులు రాచమల్ల సురేష్, విశ్వనాథం, బండి శ్రీకాంత్ యాదవ్, కొన్నమొల్ల శ్రీనివాస్, రాచమల్ల జయసింహ, మురళి గౌడ్ పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాంగా ఉండాలని భగవంతుని వేడుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు.





## అమ్మ పేరుతో మొక్క.. పర్యావరణ పరిరక్షణకు బాట

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19**: మహా : పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా సత్తుపల్లి పట్టణంలోని అయ్యగారిపేట జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రేహానా బేగం, మున్సిపల్ కమిషనర్ నరసింహ, మండల విద్యాశాఖ అధికారి ఎన్. రాజేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని నిరంతరం సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. నాటిన మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షిస్తూ పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 5 న కలక్టరేట్ ముట్టడిని

## జయప్రదం చేయండి

**దమ్మపేట ,మహా :** ఆదివాసుల హక్కులు ,చట్టాలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న కలక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేసేందుకు ఆదివాసులు భారీగా తరలిరావాలని జిల్లా ఆదివాసి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఆదివాసి నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏళ్ళతరబడి బానిసలుగా తమ జీవనం కొనసాగుతుందని ,ఆది వాసి హక్కులు ,చట్టాలు కాపాడుకోవడానికి జిల్లా లోని ఆదివాసి నాయకులు ,యువకులు ,మహిళలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు డిమాండ్ లతో కూడిన కరపత్రాలను పాల్వంచ పట్టణంలో పంపిణీ చేశారు. దానిలో ముఖ్యాంశాలు 1/70 చట్టాన్ని పటిష్టం గా అమలు చేసి ,ఆదివాసి భూములను పరిరక్షించాలి . ఆదివాసి చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి . లంబాడాలను ఆదివాసుల జాబితా నుండి పూర్తిగా తొలగించాలి .వంటి పలు డిమాండ్ లపై ముట్టడి ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో ఆదివాసిలు పాల్గొన్నారు.

# రూ.6,500కు బొజ్జ గణపయ్య లడ్డూ..

- 23 ఏళ్లుగా కొనసాగుతున్న కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీ వినాయకోత్సవాలు..
- వైభవంగా నిమజ్జన వేడుకలు



**సత్తుపల్లి, సెప్టెంబర్ 19:మహా :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కిష్టారం అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీలో గత 23 ఏళ్లుగా ప్రతిష్ఠిస్తున్న బొజ్జ గణపయ్యకు శనివారం ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఐదు రోజులపాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడి లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించగా మారోజు శ్రీను, కరుణ దంపతులు రూ.6,500కు లడ్డూను దక్కించుకున్నారు.

**'లడ్డూ దక్కడం ఎంతో ఆనందంగా ఉంది'**

లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న మారోజు శ్రీను, కరుణ దంపతులు మాట్లాడుతూ.. ఐదు రోజులపాటు మండపంలో భక్తుల పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య లడ్డూను సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులు తమ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ లడ్డూ ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించడం తమకు ప్రత్యేకమైన అనుభూతి అని పేర్కొన్నారు.

**అంగరంగ వైభవంగా ఊరేగింపు..**

లడ్డూ వేలం అనంతరం బొజ్జ గణపయ్య విగ్రహాన్ని కిష్టారం గ్రామ పురవీధుల్లో భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని భక్తిగీతాలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడికి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కమిటీ సభ్యులు, పెద్దల హాజరు..**

ఈ కార్యక్రమంలో గణపతి వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు కిష్టపాటి కోటిరెడ్డి, కిష్టపాటి రాఘవరెడ్డి, ఉప్పతల సిద్ధు, కిష్టపాటి శ్రీనివాసరెడ్డి, వీర నాగేంద్రరెడ్డి, ఈర్ల లోకేష్, ఉప్పతల గోపి, చింతపండు మనోజ్‌తో పాటు అంబేద్కర్‌నగర్ బీసీ కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- దేవాలయ ఆలయ పునః నిర్మాణాలు నాణ్యతతో పూర్తిచేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాచలం పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా శాంతియుతంగా సురక్షితంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేపెట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలం గోదావరి నది తీర ప్రాంతంలో నిమజ్జన ఘాట్‌ల వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనానికి లాంచీలు బారికేడింగ్ లైటింగ్ సీ.సీ కెమెరాల పర్యవేక్షణ తాగునీరు వైద్య బృందాలు గజ ఈతగాళ్లు వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ వివరించారు. నదీ తీర ప్రాంతంలో ఎటువంటి అపశృతి జరగకుండా విస్తృతంగా భద్రతతో కూడిన రక్షణ చర్యలు చేపట్టాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట్, డీఎస్పీ అరుణ్ కుమార్ లకు సూచించారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో జరిగే నిమజ్జనానికి పోలీస్ రెవెన్యూ రవాణా వైద్య ఆరోగ్య అగ్నిమాపక అటవీ ఇరిగేషన్ దేవాదాయ పంచాయతీ శాఖల అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉన్నతాధికారులకు సమాచారం అదించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వినాయక నిమజ్జనానికి భద్రాచలం రానున్నారని తెలిపారు. నిర్దేశించిన ప్రదేశాలలోనే వినాయక నిమజ్జనం చేయాలని ప్రణాళికా బద్ధంగా పనిచేసేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని చిన్నపిల్లలు వృద్ధులు మహిళలు నదీ ఘాట్ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని భక్తులకు సూచించారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రాకూడదని విగ్రహాల నిమజ్జనం క్రమపద్ధతిలో జరగాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. భక్తులకు గణేశ మండపాల నిర్వాహకులు వినాయక విగ్రహాల ఊరేగింపులో భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించాలని పెద్ద సంఖ్యలో గుంపులు ఏర్పడి అల్లర్లు చేయకుండా శాంతియుతంగా ఊరేగింపులు నిర్వహించాలన్నారు. ఊరేగింపుల సమయంలో డీజేలు అధిక శబ్దపూరిత మ్యూజిక్ వాడకూడదని ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా మున్సిపల్ పోలీస్ శాఖల సూచనల మేరకు మాత్రమే ఊరేగింపులు కొనసాగించాలన్నారు. జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో క్రమశిక్షణతో శాంతియుతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**దేవాలయ నిర్మాణ పనులు పరిశీలన..**

దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పున నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం చిత్రకూట మండపం పరిసరాలను, గోశాల ప్రాంతాన్నీ అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ శివాలయానికి వెళ్లే మార్గం రామాలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మాడవీధులను పరిసర ప్రాంత అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అభివృద్ధికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్స్ ను ఆలయ నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని తెలియజేసారు. ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా దశాబ్దాల కాలం పాటు నిర్మాణాలు ప్రతిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ, డీఎస్పీ అరుణ్ కుమార్, పంచాయతీ ఈఓ శ్రీనివాస్ రావు, దేవాలయ ఈవో దామోదర్ రావు, ఏం.వీ.ఐ సంఘం వెంకట పుల్లయ్య, ఇరిగేషన్ ఏఈఈలు రవితేజ, గణేష్, ఐ.టీ.సీ ప్రతినిధులు చెంగల్ రావు, దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు

**వరంగల్, కార్పొరేషన్ మహా:** రాబోయే వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆదివారం లోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని మడికొండ చెరువు, బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం, ఉర్సుగుట్ట, బేస్తం, అగర్తల, కట్టమల్లన్న, చిన్నవడ్డేపల్లి, ముచ్చర్ల, హసన్‌పర్తి, భీమారం చెరువులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన కేంద్రాల్లో పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఐదవ రోజు నుంచే విగ్రహాల నిమజ్జనం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టాలని తెలిపారు. చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించి, పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనానికి వినియోగించే క్రేన్లకు ఇంధనం ముందుగానే సమకూర్చుకోవాలని, అవసరమైన సిబ్బందిని కేటాయించాలని సూచించారు. తెప్పలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్, వెలుతురు, పారిశుద్ధ్య సదుపాయాల్లో లోటు లేకుండా చూడాలన్నారు. ఇంజనీరింగ్, ఆర్అండ్‌బీ, డీఆర్ఎఫ్, మైనింగ్, మత్స్య, వైద్య శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు.



# ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం..

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే..

**మణుగూరు, మహా :** హైదరాబాద్ పట్టణంలోని ఖైరతాబాద్ శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన మహాగణపతి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఉత్సవ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ వాణి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిషోర్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యుడు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి

- ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలే ఆకాంక్ష.. మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19:మహా :** "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో సత్తుపల్లి ప్రజల ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలి. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలి" అని మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆకాంక్షించారు. సత్తుపల్లి పట్టణంలోని 3వ వార్డు, 14వ వార్డు గాంధీనగర్‌లో నిర్వహించిన గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఆయన పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి నిమజ్జన వేడుకల్లో పాల్గొని, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, పరస్పర ఆప్యాయతలను పెంపొందిస్తాయని అన్నారు. గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించిన ప్రతి ఒక్కరిపై ఆయన కృప ఉండాలని, సత్తుపల్లి ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. "గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మరింత ఆనందంగా, మరింత వైభవంగా గణనాథుడిని ఆహ్వానిద్దాం" అంటూ భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. నిమజ్జన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి జయజయధ్వానాలు చేస్తూ ఉత్సాహంగా నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల నరసింహారావు, క్లబ్బు వెంకన్న, షేక్ బాబు, మీదే శీను, దావూద్ షేక్, చాంద్ పాషా, అద్దంకి అనిల్, గంద్ర రఘు, జొన్నలగడ్డ కృష్ణ, తడికమళ్ల సాల్మన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనం రోజు ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు

**వరంగల్, బ్యూరో మహా ;** వినాయక నిమజ్జనం సందర్భంగా తేది 23 9 2026 ఉదయం 10 00 గంటల నుండి తేది 25 9 2026 మధ్యాహ్నం 17:00 గంటల వరకు వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటి పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా నగరం నలువైపుల నుండి శోభాయాత్ర నిర్వహించబడుతుంది. కావున నగరంలో పెద్ద స్థాయిలో నిమజ్జనానికి విగ్రహాలను తరలించే మార్గాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకుగాను ట్రై సిటి పరిధిలో వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ట్రాఫిక్ ఆంక్షలు లో భాగంగా తేదీ. 23 9 2026 ఉదయం 10:00 గంటల నుండి తేదీ




25 9 2026 సాయంత్రం 17:00 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని అంతేకాకుండా భారీ వాహనాల తో పాటు పోలీసులు సూచించిన మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ముఖ్యంగా నిమజ్జనం రోజున శోభా యాత్ర వెళ్ళే, మార్గములో మరియు నిమజ్జనం జరిగే ప్రదేశంలో వాహనాలు నిలుపరాదని ప్రజలు అందరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరిచగలరని పోలీస్ కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు.



# భక్తి.. సేవ.. ఐక్యతే పండుగల స్ఫూర్తి

- డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్

**సత్తుపల్లి, సెప్టెంబర్ 19**:మహా : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కల్లూరు పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పెనుబల్లి మండలం మండలపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సందర్భంగా నిర్వహించే అన్నదానం, సేవా కార్యక్రమాలు సామాజిక బాధ్యతను చాటుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరి, కల్లూరు పట్టణ మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కల్లూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉస్మాన్ అలీ, వార్డు కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలపాడులో సర్పంచ్ గాయం రమేష్, దిశా కమిటీ సభ్యులు పోతురాజు కిషోర్, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# సింగరేణి కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలి

- కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలి
- సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో సివిల్ ఎస్ ఈ కార్యాలయం వద్ద ధర్నా
- అధికారిని హామీతో ధర్నా విరమణ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లుపై సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఎటువంటి కాంట్రాక్టర్ పనులు ఇవ్వకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ ఎస్ ఈ కార్యాలయం వద్ద కార్మికులతో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ధర్నాను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి లోడింగ్ అన్లోడింగ్ పనిచేస్తున్న సెంట్రల్ వర్క్ షాప్ కార్మికులకు సెక్యూరిటీ కిట్టులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని విమర్శించారు. బూట్లు బట్టలు గ్లౌజులు టోపీ తదితర రక్షణ పరికరాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గత నెలలోనే తన కాంట్రాక్ట్ ని ముగించుకున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. రెండు సంవత్సరాల పాటు కార్మికులకు రక్షణ కల్పించే పనిముట్లు ఇవ్వకుండా వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి ప్రతినెల 7వ తేదీ లోపున ఇవ్వాల్సిన జీతాలు నెల చివరి వరకు ఇవ్వడం పట్ల కార్మికులు నాయకులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తన కాంట్రాక్టు పని అయిపోయినప్పటికీ గత నెల ఇవ్వవలసిన జీతం ఇవ్వకుండా కక్షపూరిత వ్యవహారం పై అధికారులకు విన్నవించారు. అధికారుల వద్దకు మీరు లెటర్లు పెడితే నేను ఎలా ఇస్తానని బెదిరించడం సరైంది కాదన్నారు. కార్మికులను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తీవ్రంగా కాంట్రాక్టర్ హెచ్చరించారు. జీతాలు ఇచ్చేవరకు ధర్నాను విరమించమని ఆయన అన్నారు. దీంతో అధికారిని సరిత కాంట్రాక్టర్ తో మాట్లాడి సోమవారం లోపు సమస్య పరిష్కరిస్తామని జీతాలు వేస్తామని చెప్పడంతో ధర్నాను విరమించడం జరిగింది. ఈ ధర్నాలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా నాయకులు సూర ఐలయ్య, సిఐటియు నాయకులు ఎన్.రమేష్, సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం బ్రాంచ్ నాయకులు గుగులోత్ సక్రం, చందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ వెంకన్నబాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం నసాగుతుందని తెలిపారు. ఎవరైనా బెదిరింపులు దాడులు అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీఎస్పీ వెంకన్నబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అధికార లాంఛనాలతో ఏఆర్ ఆర్ఐ అంతిమ సంస్కారాలు

**కారేపల్లి, మహా :** నిజామాబాద్ జిల్లాలో ఏఆర్ ఆర్ఐగా పనిచేస్తున్న హనుమకొండ సతీష్ (40) పిస్టల్ ను శుభ్రపరిచే క్రమంలో మిస్ ఫైర్ అయి మృతి చెందగా మృతదేహాన్ని సతీష్ స్వగ్రామం సింగరేణి మండల శాంతినగర్ లో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్య క్రియలకు నిజామాబాద్ ఏఆర్ ఏసీపీ బి.కృష్ణ, ఏఆర్ ఆర్ఐ అడ్మిన్ డి.హరికుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐ, ఇతర సిబ్బంది దహన సంస్కారాలకు హాజరైనారు. పోలీస్ అధికారిక లాంచనాలు గౌరవ సూచకంగా పోలీసు బలగాలు గాలిలోకి తుపాకులు పేల్చారు. అంతకు ముందు దహన సంస్కారాల ఖర్చులకు గాను మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా రూ.30వేల చెక్కును అందజేశారు. మృతునికి భార్య కళ్యాణి, ఒక కూతురు,కుమారుడు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీష్ విధి నిర్వహణలో నియమ, నిబంధనలకు కట్టుబడి పని చేసేవాడని అతని సేవలు మరువలేనివని గుర్తుకు చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరితగతిన అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐలు హనుమకొండ వెంకటేశ్వర్లు, తాటిపాముల సురేష్, పోలీస్ సిబ్బంది,స్థానిక నాయకులు పెద్ద బోయిన ఉమాశంకర్,అడపా పుల్లారావు,హనుమకొండ రమేష్, గుడిపూడి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి ఐక్యతలతోనే సమాజ ప్రగతి

- ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యత
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** లోకకల్యాణం మానవాళి శాంతి ఐక్యతలే లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఆకాంక్షించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి తిరుపతి వెంకటేశ్వరస్వామి క్షేత్రం వరకు సుమారు 600 కిలోమీటర్ల మేర చేపట్టిన 'భద్రాద్రి రాముడు టు గోవిందుడు' పాదయాత్ర బృందానికి భద్రాద్రి జిల్లా సరిహద్దులో శనివారం మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ సర్వజనుల సంక్షేమం మానవ సమాజంలో శాంతి నెలకొనాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనతో పాటు సమాజ హితం కోసం ప్రతిరోజూ ఒక చెట్టు నాటుతూ వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడం గొప్ప పర్యావరణ స్పృహకు నిదర్శనమని కొనియాడారు. భక్తిభావానికి సామాజిక స్పృహను జోడించి చేపట్టిన ఈ మహత్తర కార్యం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, వై.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మురళి, సనత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## న్యాయవాదుల సమస్యలపై ఐక్య పోరాటాలు..

- మణుగూరులో ఐలు జిల్లా 2వ మహాసభ
- 34 మందితో నూతన జిల్లా కౌన్సిల్ ఎన్నిక

**మణుగూరు, మహా :** న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నాయకులు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2వ మహాసభ శనివారం మణుగూరులో నిర్వహించారు. మహాసభ ప్రారంభ సందర్భంగా ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పార్థసారథి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర ఆర్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాసరావు, ఐలు రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఆర్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజలు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. న్యాయవాదులు ఐక్యంగా ఉంటేనే తమ సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో నెలకొన్న సమస్యలు, న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మహాసభలో చర్చించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరయ్యారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాలకు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సమావేశంలో సంస్థాగత అంశాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా 34 మందితో నూతన జిల్లా కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లాలో న్యాయవాదుల సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని మహాసభ నిర్ణయించింది. కార్యక్రమంలో ఐలు నాయకులు చాలా జలసూత్రం శివరాం ప్రసాద్, జి విద్యాసాగర్, ఏడునూతల శ్రీనివాసరావు, జిల్లాలోని వివిధ వాట్ అసోసియేషన్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మరింత పెంపొందించాలి

- గణిత శాస్త్ర బోధన పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, నల్లబెల్లి మహా :** నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను, శనిగరం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్.. వారి లెక్కల సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు గణిత శాస్త్రం లోని వివిధ అంశాల పై ప్రశ్నలు వేసి, వారు సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారో ఆసక్తితో తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠ్యాంశాల పై అవగాహనను పరిశీలించారు.అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నల్లబెల్లి తహసీల్దార్ కృష్ణ, సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## ఘనంగా చాత్రోంకి గూంజ్ కార్యక్రమం

- రాహుల్ గాంధీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం
- ఏర్పాటు చేసిన హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు

**హనుమకొండ, మహా ;** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన దేశవ్యాప్త విద్యార్థి యువజన సంవాద ఉద్యమం ఛాత్రోం కీ గూంజ్ విద్యార్థుల గర్జన సభకు మద్దతుగా హనుమకొండ డిసిసి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సమన్వయంతో శనివారం డిసిసి కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్, మహిళా అధ్యక్షురాలు బంక సరళ, డీసీసీ జనరల్ సెక్రటరీ, డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ కన్వీనర్ మారంరెడ్డి కొటిల్ రెడ్డి, కమలాపూర్ ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, స్టేట్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ ఛైర్మన్ గోవిందు శ్వేత, హనుమకొండ జిల్లా ఎన్. ఎస్. యు. ఐ అధ్యక్షులు వేణు చారి, అలువాల కార్తీక్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులు, విద్యార్థి విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. మనం ఇక్కడ ఒక ప్రత్యేకమైన, అత్యంత ప్రాముఖ్యమైన అంశం గురించి మాట్లాడుకోవడానికి సిద్ధమయ్యాం అదే ఛాత్రోం కి గూంజ్ విద్యార్థుల గర్జన చరిత్రను తిరగరాసే శక్తి, సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే సత్తా కేవలం యువతకు, విద్యార్థులకు మాత్రమే ఉంది. చరిత్రలో ఎప్పుడు ఏ అన్యాయం జరిగినా, పాలకులు ఎప్పుడు దారి తప్పినా మొదటగా ప్రశ్నించిన గొంతుక విద్యార్థిదే అని మనమంతా గుర్తుంచుకోవాలి. నేడు మన దేశంలో విద్యా వ్యవస్థ ఎలాంటి పరిస్థితుల్లో ఉందో మనమంతా చూస్తూనే ఉన్నాం. ఒకవైపు రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల కలలను ఛిద్రం చేస్తూ నిరంతరం జరుగుతున్న పరీక్షల పేపర్ లీకేజీ లు, మరోవైపు పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారుతున్న అధిక ఫీజులు మనల్ని వేధిస్తున్నాయి. సకాలంలో జరగని పరీక్షలు, ఉద్యోగ నియామకాల్లో అనవసరమైన ఆలస్యం వంటివన్నీ నేటి యువత భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నాయి. ఎంతో ఆశతో, కోచింగ్ సెంటర్లలో మరియు హాస్టళ్లలో నరక యాతన అనుభవిస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు నేడు సరైన భద్రత కరువైంది. ఒక విద్యార్థి తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని మన నిశ్శబ్దం పాలకులకు బలంగా మారకూడదని మన హక్కుల కోసం, మన ఉజ్వల భవిష్యత్తు కోసం మనమంతా ఒక్కతాటి పైకి రావాలి. ఈ విద్యార్థుల గర్జన దేశంలోని ప్రతి మూలకు వినిపించేలా ఢిల్లీ పీఠాలు కదిలేలా మన గొంతుకను పెంచుతామని పిలుపునిచ్చారు. పరీక్షల ఒత్తిడి లేని, పేపర్ లీకేజీ లు లేని, మెరుగైన విద్యా భారతదేశాన్ని నిర్మించుకోవడానికి మనమంతా భాగస్వామ్యుల వుదామని అన్నారు. ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న జాతీయ స్థాయి విద్యా, ఉద్యోగ సమస్యలను, వారి ఆవేదనలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే క్రమంలో రాహుల్ గాంధీ ఈ వినూత్న వేదికను నిర్మించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు యువత కేవలం చదువులకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుంటూ రాహుల్ గాంధీ అడుగుజాడల్లో నడవాలని ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మండల, డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి, యువజన విభాగాలు పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని, లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 22-A భూముల విషయంలో బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు

- డాక్టర్ కోటూరి మానవతారాయ్
- సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి
- భూదాన్,వక్ఫ్ భూముల ఆక్రమణల పై ప్రభుత్వం కఠిన చర్యలు
- జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తాం
- వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు అయూబ్




**వరంగల్,బ్యూరో మహా ;** 22ఏ నిషేధిత జాబితాలోని భూముల విషయంలో ఇటీవల బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అనేక అపోహలు, అనుమానాలు సృష్టిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, వరంగల్, హనుమకొండ సమన్వయకర్త డాక్టర్. కోటూరి మానవతారాయ్ అన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వరంగల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి తో కలిసి పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా కోటూరి మానవ తారాయ్ మాట్లాడుతూ**

కోట్లాది ఎకరాల ప్రజల భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం 22A నిషేధిత జాబితాలో చేర్చిందంటూ బీఆర్ఎస్ నేతలు విషప్రచారం చేస్తున్నారని, కానీ 22ఏ సమస్య కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది కాదని స్పష్టం చేశారు. ఈ సమస్య ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కాలం నుంచే ఉందని, గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కూడా 22ఏ నిషేధిత జాబితా కొనసాగిందని తెలిపారు.ప్రభుత్వ నిషేధిత జాబితాలో మొత్తం 1,02,00,000 ఎకరాలు ఉన్నాయని, అందులో 3,73,000 ఎకరాలు ప్రైవేటు భూములు ఉన్నాయని, మిగిలిన భూముల్లో నిబంధనల ప్రకారం శాశ్వతంగా నిషేధిత జాబితాలో ఉండే భూములు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్ లో పొరపాటున 22ఏ జాబితాలో చేరిన ప్రైవేటు భూములను సరిచేసేందుకు గతంలోనే సీసీఎల్ఏ నుంచి 0311 2022న సీఎంఆర్ No.3691/2022 సర్క్యులర్ జారీ అయిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో 22ఏ జాబితాలో మార్పులు చేయాల్సి వచ్చిన సమయంలో కొన్ని ప్రాంతాల్లో పాత జాబితా తిరిగి నమోదవడంతో సమస్యలు ఏర్పడ్డాయని వివరించారు.స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి భూమి కూడా పొరపాటున నిషేధిత జాబితాలో చేరిన విషయమే దీనికి ఉదాహరణ అని ఆయన అన్నారు. సమస్యను గుర్తించిన వెంటనే రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు పొరపాట్లను సరిచేస్తామని ప్రకటించారని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించగా మొత్తం 980 ఫిర్యాదులు అందాయని చెప్పారు. పొరపాటున 22ఏ జాబితాలో చేరిన అర్హులైన ప్రైవేటు భూముల సమస్యలను పరిష్కరించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేస్తున్నామని ఆయన తెలిపారు. అందువల్ల 22ఏ సమస్యను కోట్లాది మంది ప్రజల సమస్యగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదన్నారు.అధికారంలో ఉన్న సమయంలో నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో జరిగిన వ్యవహారాల పై కూడా బీఆర్ఎస్ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని డా. మానవతారాయ్ డిమాండ్ చేశారు. 2004 వరకు ఎకరం భూమి కూడా లేని కేసీఆర్ కుటుంబ సభ్యులకు 2026 నాటికి 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో 439.30 ఎకరాల భూములు ఎలా వచ్చాయో తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.అలాగే కేటీఆర్ కుమారుడు హిమాన్షు కు 46 ఎకరాల భూమి ఎలా వచ్చిందో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నేతల భూముల వ్యవహారాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించిన తర్వాత, రాజకీయంగా ఎదురుదాడి చేసేందుకు ముఖ్యమంత్రికి 175 ఎకరాల భూములు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

**జిల్లా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ**

22ఏ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. 22ఏ సమస్య గత ప్రభుత్వాల కాలం నుంచే ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రైవేటు భూ యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు.వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని భూదాన్, వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణలపై కూడా ఆయన స్పందించారు. ఈ భూముల ఆక్రమణలకు సంబంధించి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన ఎంత పెద్ద రాజకీయ నాయకులు ఉన్నా ప్రభుత్వం ఎవరినీ వదిలి పెట్టదని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నాయకులు 22ఏ నిషేధిత భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుని, అక్రమంగా ఆస్తులు కూడ బెట్టడంతో పాటు ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వాస్తవాలను తెలుసుకుని బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అయూబ్ సూచించారు.ముఖ్యంగా వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు కొన్ని ఏళ్లుగా ఎదురు చూస్తున్న జర్నలిస్టుల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్య తన దృష్టిలో ఉందన్నారు. త్వరలోనే వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, జర్నలిస్టుల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో సమన్వయం చేస్తామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని అయూబ్ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామి రెడ్డి మాట్లాడుతూ 22ఏ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని, అర్హులైన భూయజమానులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు పారదర్శకమైన భూ పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అపోహలు సృష్టించడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, ఓబీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, మహిళ జిల్లా అధ్యక్షురాలు కర్నాటీ పార్వతమ్మ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, జిల్లా అధికార ప్రతినిధుల తో పాటు పలువురు నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## నాలా కబ్జాపై విచారణ జరపాలి

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 19, మహా:** శేరిగూడలో నాలా కబ్జాపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కావలి సురేష్ డిమాండ్ చేశారు. గ్యాప్ ఏరియాలోని ప్రభుత్వ భూములు, నాలాలు, కాలువలు, చెరువులు, నీటి ప్రవాహ మార్గాలపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. గురునానక్, శ్రీ ఇందు కాలేజీల పరిసరాల్లోని భూములకు సంబంధించి వస్తున్న ఆరోపణలపైనా అధికారులు విచారణ చేపట్టాలని అన్నారు. శేరిగూడలోని రియల్ ఎస్టేట్ వెంచర్ పరిధిలో నాలా మార్గంలో మార్పులు, పూడ్చివేతలు లేదా ఆక్రమణలు జరిగాయా అనే అంశాన్ని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, నాలాలను పరిరక్షించాల్సిన అధికారులు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలని అన్నారు. రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించాలని కోరారు. ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత భూములను, నాలాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కావలి సురేష్ డిమాండ్ చేశారు.

## అమ్మ పేరుతో ఒక మొక్క

**పాఠశాలలో ప్రారంభించిన మొక్కలు నాటే కార్యక్రమం**

**కారేపల్లి, మహా :** ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో శనివారం ఏక్ పెడ్ మాక్ నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమాన్ని ప్రారంభించారు. కారేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్( టోనీ) ఎంపీడీవో బి. పద్మ, ఎంఈవో దుగ్గిరాల జయరాజు లు మొక్కలు నాటి విద్యారులతో నాటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక్కొక్క మొక్క చొప్పున నాటాలని కోరారు. అమ్మపై ఉన్న ప్రేమతో విద్యార్థులు మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఎన్ఆర్ఈజీఎస్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






## కిట్స్ జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న**

**హనుమకొండ, మహా ;** హనుమకొండ లోని కరీంనగర్ ప్రధాన రహదారి కిట్స్ కళాశాల జంక్షన్ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు.శనివారం కమిషనర్ జంక్షన్ అభివృద్ధి చేయనున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణ పనులతో పాటు ఫుట్‌పాత్‌లు, ఐలాండ్‌ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు అభివృద్ధి, జంక్షన్ సుందరీకరణ తదితర పనులను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. టెండర్ ప్రక్రియ పూర్తైనందున ఎలాంటి జాప్యం లేకుండా పనులను ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. జంక్షన్ అభివృద్ధితో వాహనదారులు, పాదచారులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రాంతానికి మరింత ఆకర్షణీయమైన రూపాన్ని తీసుకురావాలని సూచించారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గణపతుల సేవలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

**ప్రత్యేక పూజలు, అన్న ప్రసాద వితరణ లో పాల్గొన్న నరేందర్**



**వరంగల్, మహా ;** వరంగల్ నగరం కాశీబుగ్గ ప్రధాన రోడ్డులోని సర్కార్ బాయి వద్ద, నవజ్యోతి యూత్ ఆధ్వర్యంలో, గోరంట్ల మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి జీడబ్ల్యూఎంసీ మొదటి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.. వర్తక సంఘం ఆధ్వర్యంలో దేశాయిపేట రోడ్డులోని 80 ఫీట్ రోడ్డు వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో నన్నపునేని నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ఆయన స్వయంగా వడ్డించారు.అనంతరం వర్తక సంఘం సభ్యులు నన్నపునేని నరేందర్ ను కాషాయ పగిడి, శాలువాతో సన్మానించి, తమ కార్యక్రమానికి హాజరై ప్రోత్సహించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ, వినాయక చవితి వంటి పర్వదినాల్లో భక్తి, సేవాభావంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.భక్తులు, ప్రజలతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్, గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరి పై ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం నన్నపునేని నరేందర్ శ్రీ వరసిద్ధి వినాయక్ యూత్ అసోసియేషన్, యువ నాయకులు బైరి అఖిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమానికి నరేందర్ హాజరై అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాపర్టీ సర్వేకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలి

- నగర భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి
- బల్దియా కమిషనర్ టీ. వెంకన్న



**వరంగల్, కార్పొరేషన్ మహా;** జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆధారంగా సమగ్ర ప్రాపర్టీ సర్వే నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని బల్దియా కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో జీఐఎస్ టెక్నికల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఐఎస్ ఆధారిత ఆస్తి పన్ను సర్వే నిర్వహణకు సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలు, అవసరమైన డేటా సేకరణ, భవిష్యత్ వినియోగం పై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వేలో నగరంలోని ఆస్తులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని శాస్త్రీయంగా నమోదు చేసేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఎన్ఐటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు, కుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యుల సూచనలు, సాంకేతిక అవసరాలు, నగర భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) ను సమగ్రంగా రూపొందించాలని కమిషనర్ పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా, శాస్త్రీయంగా, సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

**కారేపల్లి, మహా:** ఖమ్మం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయకపోవడంతో జిల్లా గిరిజనులకు పలు ప్రభుత్వ పథకాలు అందడం లేదని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం కారేపల్లిలో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఐటీడీఏ అవసరమన్నారు. కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, అటవీ హక్కు పత్రాలు, పోడు భూములకు విద్యుత్ కనెక్షన్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని తెలిపారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగే తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని చెప్పారు. మహాసభల పోస్టర్‌ను సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్‌కుమార్ ఆవిష్కరించారు.

# యషికా ఆనంద్ గ్లామర్ లుక్

**హైదరాబాద్, మహా:** ఆధునిక గ్లామర్, స్ట్రీట్ ఫ్యాషన్ కలయికతో నటి, మోడల్ యషికా ఆనంద్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. వైట్ కార్సెట్ హాల్టర్ టాప్, లైట్ వాష్ జీన్స్‌పై ముత్యాల అలంకరణతో రూపొందించిన దుస్తుల్లో ఆమె ప్రత్యేకమైన స్టైల్‌తో కనిపించారు. క్లాసిక్ స్టోన్ నెక్లెస్, చేతులకు బీడెడ్ బ్రేస్‌లెట్లు, నాభి పియర్సింగ్‌తో ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ జతైంది. సహజమైన సూర్యకాంతిలో తీసిన ఫొటోల్లో యషికా ఆత్మవిశ్వాసంతో కూడిన గ్లామర్ లుక్‌లో మెరిశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తమిళ చిత్ర పరిశ్రమలో మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించిన యషికా ఆనంద్.. 2018లో విడుదలైన 'ఇరుట్టు అరైయిల్ మురట్టు కుత్తు' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అడల్ట్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి ప్రత్యేక స్పందన లభించింది. అనంతరం ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్ తమిళ్'లో పాల్గొనడంతో ఆమెకు మరింత పాపులారిటీ వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా తన వ్యక్తిత్వంతో పాటు ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ అయ్యే అవకాశం లభించింది.మోడలింగ్, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలతో బిజీగా ఉండే యషికా.. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తమిళ సినిమాలతో పాటు మ్యూజిక్ వీడియోలు, ఫ్యాషన్ ఫొటోషూట్లు, బ్రాండ్ క్యాంపెయిన్లలోనూ ఆమె కనిపిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ యషికాకు గణనీయమైన అభిమాన వర్గం ఉంది. ముఖ్యంగా ఆమె ఫ్యాషన్ స్టైలింగ్, ఫొటోషూట్లు తరచూ వైరల్‌గా మారుతుంటాయి.ఇక యషికా తాజా చిత్రాల విషయానికి వస్తే.. 2024లో యాక్షన్ థ్రిల్లర్ 'వెపన్', మిస్టరీ థ్రిల్లర్ 'పడిక్కాద పక్కంగళ్', ఫాంటసీ కామెడీ 'డబుల్ టక్కర్', కామెడీ ఎంటర్‌టైనర్ 'జాలీ ఓ జిమ్‌ఖానా' వంటి చిత్రాల్లో నటించారు. విభిన్న జానర్లలో వరుసగా అవకాశాలు అందుకుంటూ తన నటనా పరిధిని విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న 'డెవిల్స్ డబుల్ నెక్స్ట్ లెవల్', యాక్షన్ డ్రామా 'టీఎన్ 2026' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.సినిమాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తున్న యషికా ఆనంద్.. తాజాగా షేర్ చేసిన ఈ గ్లామర్ ఫొటోలతో మరోసారి వార్తల్లో నిలిచారు. సంప్రదాయ అందానికి ఆధునిక ఫ్యాషన్ టచ్ జోడిస్తూ ఆమె చేసిన స్టైలింగ్ ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.



# సుకుమార్ ప్రభావం ఎంతో ఉంది

హైదరాబాద్, మహా: గ్రామీణ జీవితం, సహజమైన భావోద్వేగాలు, మట్టి వాసనతో కూడిన కథలను తెరపై ఆవిష్కరిస్తున్న యువ దర్శకుల్లో శ్రీకాంత్ ఓదెల ఒకరు. తొలి చిత్రం నుంచే తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరుచుకున్న ఆయన.. తన సినీ ప్రయాణంలో దర్శకుడు సుకుమార్ అందించిన ప్రోత్సాహం, శిక్షణ కీలక పాత్ర పోషించాయని ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు.

**సినిమాలపై చిన్నతనం నుంచే ఆసక్తి**

శ్రీకాంత్ ఓదెలకు చిన్న వయసులోనే సినిమాలపై ఆసక్తి ఏర్పడిందట. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'జగడం' సినిమా చూసిన తర్వాత సినిమాలను మరింత లోతుగా అర్థం చేసుకోవాలనే కోరిక కలిగిందని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వెంటనే సుకుమార్ దగ్గర పనిచేయాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు వచ్చినట్లు చెప్పారు. తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ చాలా కాలం పాటు సుకుమార్‌ను కలిసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించారు.

**షార్ట్‌ఫిల్మ్‌తో వచ్చిన అవకాశం**

సుకుమార్‌ను కలిసేందుకు దాదాపు నాలుగేళ్ల పాటు నిరంతరం ప్రయత్నించిన శ్రీకాంత్ పట్టుదలను చివరకు ఆయన గుర్తించారట. తన ప్రతిభను చూపించేందుకు ఒక షార్ట్‌ఫిల్మ్ రూపొందించాలని సుకుమార్ సూచించడంతో శ్రీకాంత్ ఆ పని చేశారు. ఆ షార్ట్‌ఫిల్మ్ నచ్చడంతో సుకుమార్ తన దర్శకత్వ బృందంలో పనిచేసే అవకాశం కల్పించినట్లు శ్రీకాంత్ తెలిపారు. అదే తన సినీ ప్రయాణంలో కీలక మలుపుగా మారిందన్నారు.

**'నాన్నకు ప్రేమతో'తో అనుభవం**

సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నాన్నకు ప్రేమతో' చిత్రానికి శ్రీకాంత్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. సినిమా షూటింగ్‌లో ఎక్కువ భాగం విదేశాల్లో జరగడంతో ఆయన హైదరాబాద్‌లో ఉండి ప్రీప్రొడక్షన్ పనులతో పాటు ఇతర బాధ్యతల్లో భాగమయ్యారు. అనంతరం 'రంగస్థలం' చిత్రానికి సంబంధించిన పనుల్లో మరింత విస్తృతంగా పాల్గొన్నారు. కాస్ట్యూమ్ విభాగం సమన్వయం, లొకేషన్‌కు సంబంధించిన పనులు, భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులతో సన్నివేశాల నిర్వహణ వంటి అంశాల్లో అనుభవం సంపాదించారు.

**సుకుమార్ నుంచి ఎంతో నేర్చుకున్నా**

దర్శకుడిగా సుకుమార్ ఆలోచనా విధానం తనపై బలమైన ప్రభావం చూపిందని శ్రీకాంత్ తెలిపారు. కథను కేవలం వినోదంగా కాకుండా.. పాత్రల భావోద్వేగాలు, పరిసరాలు, సహజత్వంతో ముడిపెట్టి చూపించే విధానం ఆయన నుంచి నేర్చుకున్నానని చెప్పారు. సుకుమార్ క్రియేటివ్ ఆలోచనలు తనకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయని, ఆయన నుంచి నేర్చుకున్న అనేక సూక్ష్మమైన అంశాలు తన దర్శకత్వ ప్రయాణంలో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

**ఇతర దర్శకుల ప్రభావం కూడా**

సుకుమార్‌తో పాటు పలువురు ప్రముఖ దర్శకుల సినిమాలు కూడా తన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయని శ్రీకాంత్ తెలిపారు. కృష్ణవంశీ, ఎస్.ఎస్. రాజమౌళి, శేఖర్ కమ్ముల, పూరి జగన్నాథ్ వంటి దర్శకుల కథ చెప్పే విధానాన్ని పరిశీలిస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. కథలోని భావోద్వేగాలను సహజంగా ప్రేక్షకులకు చేరవేయడం, పాత్రలను వాస్తవికంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని ఆయన వెల్లడించారు.



# బాడీ షేమింగ్‌పై కత్రినా స్పందన

హైదరాబాద్, మహా: సినీ తారల వ్యక్తిగత జీవితం, రూపురేఖలు, శరీరాకృతిపై సోషల్ మీడియాలో కామెంట్లు చేయడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా మహిళా సెలబ్రిటీల విషయంలో బాడీ షేమింగ్ వ్యాఖ్యలు తరచూ కనిపిస్తున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సైతం ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ తరహా వ్యాఖ్యలకు ఆమె నేరుగా స్పందించకుండా.. అందం, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు.

**రూపం కంటే ఆరోగ్యమే ముఖ్యం**

కత్రినా అభిప్రాయం ప్రకారం.. మనిషి అందాన్ని కేవలం శరీరాకృతి లేదా బాహ్య రూపంతో నిర్ణయించకూడదు. వయసు, జీవనశైలి, కుటుంబ పరిస్థితులు వంటి అనేక అంశాల కారణంగా శరీరంలో సహజమైన మార్పులు వస్తుంటాయి. ముఖ్యంగా తల్లిగా మారిన తర్వాత మహిళల శరీరంలో జరిగే మార్పులను సాధారణంగా చూడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా, సంతోషంగా ఉండటమే అసలైన అందానికి గుర్తు అని ఆమె పేర్కొన్నారు.

**కాలంతో మారిన అందం నిర్వచనం**

సినీ పరిశ్రమలోకి వచ్చిన తొలినాళ్లలో అందం విషయంలో తనకు కూడా కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండేవని కత్రినా తెలిపారు. అయితే కాలం గడిచేకొద్దీ అందం గురించి తన ఆలోచనా విధానం పూర్తిగా మారిందని చెప్పారు. ఇతరులు ఎలా చూస్తారన్నదానికంటే.. మనం మనల్ని ఎలా స్వీకరిస్తున్నామన్నదే ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు.

**ఆత్మవిశ్వాసమే అసలైన అందం**

బాహ్య సౌందర్యం శాశ్వతంగా ఉండదని, అయితే వ్యక్తిలోని ఆత్మవిశ్వాసం మాత్రం ఎప్పటికీ విలువైనదేనని కత్రినా చెప్పిన మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందాన్ని కొన్ని కఠినమైన ప్రమాణాలకు పరిమితం చేయకూడదని ఆమె సూచించినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలకు పలువురు అభిమానులు, సినీ ప్రముఖులు మద్దతు వ్యక్తం చేస్తున్నారు.

**సినిమాలకు తాత్కాలిక విరామం**

కత్రినా కైఫ్ చివరిసారిగా 2024లో విడుదలైన 'మేరీ క్రిస్మస్' చిత్రంలో విజయ్ సేతుపతితో కలిసి కనిపించారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో ఆమె సినిమాలకు కొంతకాలం దూరంగా ఉన్నారు. మరోవైపు ఆమె భర్త విక్కీ కౌశల్ వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతున్నారు.

సెలబ్రిటీలను విమర్శించే ముందు వారి వ్యక్తిగత పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందనే చర్చ ఈ ఘటనతో మరోసారి తెరపైకి వచ్చింది. శరీరాకృతిపై చేసే వ్యాఖ్యలు వ్యక్తులపై మానసికంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# అడవిలో సత్యదేవ్ పోరాటం

**హైదరాబాద్, మహా:** వైవిధ్యమైన కథలు, విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ నటుడు సత్యదేవ్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సమవర్తి'. అజయ్ నాగ్ వి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం టీజర్‌ను విడుదల చేయడంతో సినిమాపై ఆసక్తి పెరిగింది.

**అడవి నేపథ్యంలో కథ**

పులి, జింకల కథతో టీజర్ ప్రారంభమవుతుంది. అడవిలో పులి, జింకల జీవన విధానాన్ని ప్రస్తావిస్తూ సాగే వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని పెంచుతుంది. పులికి జింక కనిపించినా.. జింకకు పులి కనిపించదనే అంశాన్ని 'కలర్ బ్లైండ్‌నెస్'తో ముడిపెట్టిన తీరు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. అనంతరం అడవుల నరికివేత, ప్రకృతి విధ్వంసం, గిరిజనుల జీవన పరిస్థితులు, అడవిపై ఆధిపత్యం కోసం జరిగే పోరాటాన్ని టీజర్‌లో చూపించారు.

**మహదేవ్‌గా ఇంటెన్స్ లుక్**

సత్యదేవ్ ఈ సినిమాలో మహదేవ్ అనే పాత్రలో కనిపించనున్నారు. అడవిని, అక్కడి ప్రజలను కాపాడే వ్యక్తిగా ఆయన పాత్రను తీర్చిదిద్దినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. మహదేవ్ పాత్రలో సత్యదేవ్ లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా ఆయన చెప్పే డైలాగులు పాత్రలోని తీవ్రతను మరింత పెంచుతున్నాయి. యాక్షన్ సన్నివేశాల్లోనూ సత్యదేవ్ కొత్త తరహా మాస్ షేడ్స్‌లో కనిపించారు.

**సహజమైన విజువల్స్**

రొటీన్ యాక్షన్ కథలకు భిన్నంగా ప్రకృతి, అడవి నేపథ్యాన్ని ప్రధాన అంశంగా చేసుకుని సినిమాను రూపొందించినట్లు టీజర్ సూచిస్తోంది. అడవుల్లోని సహజ వాతావరణాన్ని తెరపై చూపించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. దక్షిణ భారతదేశంలోని ఏడు అడవులు, 42 విభిన్న లొకేషన్లలో షూటింగ్ నిర్వహించినట్లు మేకర్స్ వెల్లడించారు. దీంతో సినిమాలోని విజువల్స్‌కు మరింత సహజత్వం వచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com